తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
శనివారం
25 జూలై 2026
Follow :

# గద్వాల జిల్లాలో కాక్రోచ్‌లు పుట్టుకొస్తున్నాయ్..!!



**దేశవ్యాప్తంగా సోషల్ మీడియాలో సంచలనం సృష్టించిన కాక్రోచ్ జనతా పార్టీకి జోగులాంబ గద్వాల జిల్లా గ్రామీణ ప్రాంతాల్లోనూ మద్దతు పెరుగుతోంది. ముఖ్యంగా రాజోలి మండలంలోని పెద్ద ధన్వాడ గ్రామానికి చెందిన నిరుద్యోగి యువకుడు ములకాల రాజు 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరుతో ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి గ్రామీణ యువతను ఉద్యమంలో భాగస్వాములను చేసే ప్రయత్నం ప్రారంభించారు.**

## వాట్సాప్ గ్రూప్‌తో ఉద్యమానికి శ్రీకారం


- యువత భవిష్యత్తు కోసం పోరాటం
- నీట్ వివాదం నుంచి గ్రామీణ ఉద్యమం వరకు

**రాజోలి, జూలై 24 (జనంసాక్షి)**

జిల్లా కాక్రోచ్ సభ్యులు మాట్లాడుతూ..దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా మారిందని, పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత లేకపోవడం విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల హక్కులు, యువత భవిష్యత్తు కోసం సీజేపీ చేపడుతున్న కార్యక్రమాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను దేశ ప్రజలకు వెల్లడించాలని కోరారు. అలాగే నిరుద్యోగం, ప్రశ్నాపత్రాల లీకేజీలు, విద్యా వ్యవస్థలో లోపాలు, ఉపాధి అవకాశాల కొరత వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జీ చేయడాన్ని గద్వాల జిల్లా కాక్రోచ్ సభ్యులు తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం బలప్రయోగానికి దిగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. జంతర్‌మంతర్‌లో జరిగిన లాఠీచార్జీ ఘటనపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై పారదర్శక విచారణ నిర్వహించి విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**సమస్యలు పరిష్కరించకపోతే కాక్రోజులా వస్తాం**




జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారంలో రాజకీయ నాయకులు విఫలమైతే తాము కాక్రోజులా వస్తాం అంటూ ప్రజల మధ్యకు వచ్చి ప్రశ్నిస్తామని కాక్రోజ్ ఉద్యమానికి మద్దతు తెలిపారు.

ఈ వ్యాఖ్యను వారు రూపకంగా ఉపయోగిస్తూ, ప్రజా సమస్యలపై ఎక్కడైనా గళం వినిపించే ప్రజా ఉద్యమానికి సంకేతంగా అభివర్ణించారు. ప్రజల సమస్యలు, నిరుద్యోగం, విద్య, ఉపాధి వంటి కీలక అంశాలపై పాలకులు బాధ్యతాయుతంగా స్పందించాలని యువత కోరింది. ప్రజల కోసం ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఎన్నికల హామీల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ప్రజల్లో అసంతృప్తి మరింత పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ప్రజాస్వామ్యంలో ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పడం ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యత అని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శకంగా పాలన సాగించాలని యువత విజ్ఞప్తి చేసింది.

### అన్ని పార్టీలకు అతీతమే.. : నిరుద్యోగి యువకుడు సందీప్, పెద్ద ధన్వాడ



కాక్రోచ్ పార్టీ ఎలాంటి రాజకీయ పార్టీకి అనుబంధంగా కాకుండా, అన్ని పార్టీలకు అతీతంగా యువత సమస్యలను ప్రస్తావించే వేదికగా కొనసాగిస్తాం. ఎలాంటి రాజకీయ ఎజెండా, వ్యక్తిగత ప్రయోజనాలు లేకుండా నిరుద్యోగ యువత, విద్యార్థులు, సామాన్య ప్రజల సమస్యలకు మద్దతుగా మాత్రమే ఈ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు ప్రజల సమస్యలపై బాధ్యతాయుతంగా స్పందించాలని కోరడమే మా లక్ష్యం. యువత భవిష్యత్తు, ఉపాధి, విద్య, పారదర్శక పాలన వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే మా ఉద్యమం.

### రాజ్యాంగ మార్గంలో పోరాడుతాం : నిరుద్యోగి యువకుడు రాజు, పెద్దధన్వాడ



భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, న్యాయం కోసం పోరాడే అవకాశాన్ని కల్పించింది. రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామ్య హక్కులను సద్వినియోగం చేసుకుంటూ సమాజంలోని సమస్యలపై యువత ఐక్యంగా ముందుకు రావాలి. మనమంతా చదువుకున్నాం జ్ఞానం ఉంది. కాబట్టి ఆవేశంతో కాకుండా రాజ్యాంగబద్ధంగా, శాంతియుతంగా పోరాడుదాం. ప్రజా సమస్యల పరిష్కారం కోసం యువత ఒక్కటైతే సానుకూల మార్పు సాధ్యమవుతుంది. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రాజ్యాంగ విలువలను కాపాడుతూ ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాలు కొనసాగిస్తాం.

# పోలీసు సిబ్బందికి కంప్యూటర్ నైపుణ్యాల శిక్షణ పూర్తి

## రెండో బ్యాచ్‌కు సర్టిఫికెట్లు అందజేసిన అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి



**సంగారెడ్డి బ్యూరో, జూలై 24 (జనం సాక్షి):** జిల్లా పోలీసు సిబ్బందిలో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో వోక్సెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణా కార్యక్రమం రెండో బ్యాచ్ ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసిన సిబ్బందికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పి



మాట్లాడుతూ.. పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం రోజురోజుకు పెరుగుతున్నందున ఎంఎస్ ఆఫీస్, వర్డ్, ఎక్సెల్ వంటి సాఫ్ట్‌వేర్‌లపై ప్రావీణ్యం సాధించడం అత్యవసరమని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కార్యాలయ పనితీరులో వేగం, ఖచ్చితత్వం, సమర్థత పెరుగుతాయని తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, స్టేషన్ రైటర్లు, సైబర్ వారియర్స్, టెక్ టీమ్ సభ్యులు కలిపి మొత్తం 180 మందికి మూడు బ్యాచ్‌లుగా, ఒక్కో బ్యాచ్‌కు మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను రోజువారీ విధుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వోక్సెన్ యూనివర్సిటీ డీన్ డా. దయాశంకర్, అసిస్టెంట్ డీన్స్, ప్రొఫెసర్లు, జిల్లా పోలీసు అధికారులు, శిక్షణ పొందిన సిబ్బంది పాల్గొన్నారు.

# నీట్ పరీక్షలపై రాజకీయాలు మానుకోవాలి

• బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ దొడ్ల ప్రశాంత్




**బెజ్జంకి,జూలై 24,(జనంసాక్షి):** నీట్ పరీక్షల అంశాన్ని అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర ప్రతిపక్షాలు చేస్తున్న రాజకీయాలను దేశ ప్రజలందరూ గమనిస్తున్నారని బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ దొడ్ల ప్రశాంత్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నీట్ పరీక్షలపై రాజకీయాలు చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. నీట్ పరీక్షలను అడ్డు పెట్టుకుని కమ్యూనిస్టులు, దేశ వ్యతిరేక శక్తులు దేశంలో విభజనాత్మక వాతావరణాన్ని సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఆర్టికల్ 370ను తిరిగి తీసుకురావాలని, ఆర్ఎస్ఎస్‌ను నిషేధించాలని మాట్లాడుతున్న వారిని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు. సనాతన ధర్మానికి, ఆర్ఎస్ఎస్‌కు, నీట్ పరీక్షలకు అసలు సంబంధం ఏమిటో ప్రతిపక్షాలు ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి రాజకీయ లబ్ధిపొందాలని చూడటం అత్యంత బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ఇది నవభారతం.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారత్ అని పేర్కొంటూ, దేశాన్ని విచ్ఛిన్నం చేసే శక్తుల కుట్రలకు భారతీయ జనతా పార్టీ ఏమాత్రం భయపడదని స్పష్టం చేశారు. మోదీని బలహీనపరుస్తామనే పగటి కలలు కనడం రాహుల్ గాంధీ ఇకనైనా మానుకోవాలని,వయస్సుకు తగిన పరిణతితో వ్యవహరిస్తే మంచిదని దొడ్ల ప్రశాంత్ అన్నారు.

# నీట్ పేపర్ లీక్ ఘటనపై ఆందోళనలు..

• తూప్రాన్‌లో జూనియర్ కళాశాలల బంద్ విజయవంతం
• విద్యార్థులపై లాఠీచార్జీని ఖండిస్తూ విద్యాసంస్థల స్వచ్ఛంద మూసివేత

**తూప్రాన్, జూలై 24(జనంసాక్షి):**



నీట్ (NEET) పరీక్ష పేపర్ లీక్ ఘటనపై కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జీ చేయడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తూప్రాన్ పట్టణంలోని విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ బంద్‌కు పట్టణంలోని పలు జూనియర్ కళాశాలలు స్వచ్ఛందంగా సంఘీ భావం తెలుపుతూ బంద్‌ను విజయవంతం చేశాయి. ఈ సందర్భంగా మాస్టర్ మైండ్స్ జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, నలంద జూనియర్ కళాశాల, గీత జూనియర్ కళాశాల స్వచ్ఛందంగా మూసివేసి నిరసనకు మద్దతు ప్రకటించాయి.
ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీక్ ఘటన దేశ విద్యా వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బ తీసిందని, దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జీ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ తూప్రాన్ డివిజన్ కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు చరణ్, సంపత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.



# రానున్నది మన ప్రభుత్వమే

• మాజీమంత్రి హరీశ్ రావు

**తూప్రాన్ జూలై 24(జనంసాక్షి):**
ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సేవలు అందించాలని రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మనోహరాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆయన నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేయాలని పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. ఆయనను కలిసిన వారిలో పార్టీ రాష్ట్ర నాయకులు ర్యాకల శేఖర్ గౌడ్, మండల పార్టీ మాజీ అధ్యక్షులు పురం మహేష్ ముదిరాజ్, మాజీ వార్డు సభ్యులు రాజు యాదవ్, దుర్గేష్ యాదవ్, ఎస్సీ సెల్ నాయకులు శివకుమార్, దండుపల్లి మాజీ ఉపాధ్యక్షులు మహేందర్ గౌడ్,నరేందర్ గౌడ్, పురం ప్రభాకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకులు భాస్కర్ రెడ్డికి మాతృ వియోగం

• సంతాపం ప్రకటించిన మైపాల్ రెడ్డి



**తూప్రాన్, జూలై 24(జనంసాక్షి):**
మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు జిల్లా కాంగ్రెస్ నాయకులు భాస్కర్ రెడ్డి తల్లి రాజమణి చనిపోవడంతో రాష్ట్ర సర్పంచ్ల ఫోరం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ నాయకులు చిట్కులమహిపాల్ రెడ్డి పరామర్శించారు మండలంలోని గుండ్రేడ్పల్లి గ్రామంలో భాస్కర్ రెడ్డి స్వగృహంలో ఆమె చనిపోవడంతో ఇంటికి వెళ్లి పరామర్శించారు ఆమె పాడె ను మోశారు కుటుంబ సభ్యులకు సంతాపం ప్రకటించారు. ఆమె మృతికి మండల నాయకులు సంతాప ప్రకటించారు.

# అంగన్వాడి కేంద్రంలో సామూహిక శ్రీమంతాలు, అక్షరభ్యాసం, అన్నప్రాసనం



**నిజాంపేట, జూలై 24 (జనంసాక్షి):** నిజాంపేట మండలం నస్కల్ గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం సామూహిక శ్రీమంతాలు, అక్షరభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ గోదావరి మాట్లాడుతూ.. ప్రభుత్వం బాలింతలకు, పసి పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారుని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# వెంకటాపురం గ్రామంలో రూ.10 లక్షలతో సిసి రోడ్డు పనులు ప్రారంభం..



**సదాశివపేట, జూలై 24 (జనంసాక్షి):**మండల పరిధి వెంకటాపురం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, వెంకటాపురం గ్రామ సర్పంచ్ ఒగ్గు శ్రీనివాస్ స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో అంతర్గత సిసి రోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించిన టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇమ్రాన్,వార్డు సభ్యులు కుమార్, సురేష్,వెంకటేశం,గ్రామ శాఖ అధ్యక్షుడు సత్యనారాయణ,మాజీ సర్పంచ్ కృష్ణ,శ్రీనివాస్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైకుంఠ రథం, ఫ్రీజర్ బాక్స్ అందజేత




**చిన్న శంకరంపేట్, జూలై24 (జనంసాక్షి):** చందంపేట గ్రామంలో ఎమ్మెస్ ఎన్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యజమాన్యం సహకారంతో సిఎస్ఆర్ నిధులతో చందంపేట గ్రామానికి వైకుంఠ రథం ఫ్రీజర్ అందజేసిన కంపెనీ యజమాన్యం రానున్న రోజులలో గ్రామాన్ని మరింత అభివృద్ధి పరుస్తామని కంపెనీ ప్రతినిధులు, హెచ్ఆర్ శరత్ వెంకట్ తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్, సెక్రటరీ సంతోష్ కుమార్, ఉప సర్పంచ్ నర్సింలు, పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

• చందాపూర్‌లో మొక్కలు నాటిన సర్పంచ్



**చిన్నశంకరంపేట, జూలై 24 (జనంసాక్షి):**
చిన్న శంకరంపేట మండలం చందాపూర్ సర్పంచ్ చెన్నాగౌని కృష్ణ గౌడ్ చెట్లు నాటారు.అనంతరం ఆయన ఇంటికి ఐదు చెట్లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోతరాజు శేఖర్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ పద్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరమేశ్వర్ రెడ్డి, వార్డు సభ్యులు పడాల పద్మ వెంకటరాములు,పిల్డ్అసిస్టెంట్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ నిరంకుశ పాలనపై హోరెత్తిన నిరసన ర్యాలీ

• రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టుపై మండిపడ్డ కాంగ్రెస్ శ్రేణులు
• నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

**మక్తల్, జూలై 24 (జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు, రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల ప్రకారం మక్తల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక వైఖరిపై, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిరంకుశ పాలనపై నినాదాలు చేస్తూ పెద్ద సంఖ్యలో అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన ధర్నాలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష నేతల గొంతు నొక్కడం ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడిగా, కేంద్రంలోని మోడీ ప్రభుత్వ నిరంకుశ పాలనకు సజీవ సాక్ష్యంగా పేర్కొన్నారు. నీట్ పరీక్ష పత్రం లీకేజీ వ్యవహారంతో దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిపోయిందని నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం తక్షణమే తన వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు. ఈ భారీ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన




పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, పరీక్ష పత్రాల లీకేజీ కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం రూ. 1 కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.
ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి. గణేష్ కుమార్, మక్తల్ మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస హనుమంతు, మక్తల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మక్తల్ టౌన్ అధ్యక్షులు ఏ. రవికుమార్, సర్పంచులు, ఉప సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నాటిన చెట్లను కొట్టడం ఎందుకు

- హరితహారం చెట్ల నరికివేతపై అధికారుల దృష్టి ఎప్పుడు?



**మొగుడంపల్లి, జూలై 24(జనంసాక్షి):** మండల పరిధిలోని ధనశ్రీ గ్రామ మధ్యన ప్రధాన రహదారి పక్కన ఉన్న చెట్లను ధ్వంసం చేశారు.ముందుచూపు లేకుండా విద్యుత్ వైర్ల కింద మొక్కలను నాటడం ఎందుకు. ఆ తర్వాత అడ్డుగా వస్తున్నా యని భావించి చెట్లను ధ్వంసం చేయడం ఎందుకు అని పలువురు ప్రశ్నిస్తు న్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం. స్వచ్ఛంద సంస్థలు కోట్లది రూపాయలు వేచించి మొక్కలను నాటుతున్నారు.అయితే కొన్ని ప్రాంతాల్లో నాటిన మొక్కలను ధ్వంసం చేయడం, చెట్లను కొట్టివేయడం ఆందోళన కలిగిస్తుంది. ఒకవైపు పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేస్తుండగా, మరోవైపు నాటిన చెట్లను నరికి వేయడం పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, వాటిన్ని ధ్వంసం చేసే వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థాని కులు కోరుతున్నారు.

## బెజ్జంకిలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**బెజ్జంకి,జూలై 24,(జనంసాక్షి):** మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను శుక్రవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, ఆనందో త్సవాలతో కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి సర్పంచ్ బొల్లం శ్రీధర్,సీనియర్ నాయకులు లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి,చింతకింది శ్రీనివాస్ గుప్తా,చెలుకల తిరుపతిరెడ్డి,బోయినపల్లి శ్రీనివాస్ రావు,కోమిరే మల్లేశం,గుబిరే మల్లేశం,ఎలుక దేవయ్య,నలువాల స్వామి, కర్రావు ల మల్లేశం,బెజ్జంకి ఉపసర్పంచ్ దూమల మహేష్, సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎల శేఖర్ బాబు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దీటి రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఎల్‌నినో ప్రభావంతో

## రైతులు అప్రమత్తంగా ఉండాలి



**బెజ్జంకి,జూలై 24,(జనంసాక్షి):** కల్లేపల్లి గ్రామంలో ఎల్‌నినో ప్రభావం, వాతా వరణ పరిస్థితులపై సర్పంచ్ బిగుళ్ల మోహన ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహిం చారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏఓ సంతోష్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వర్షపాతం,ఉష్ణోగ్రతల్లో మార్పు లను దృష్టిలో ఉంచుకుని పంటల సాగులో తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ పంటల ఎంపిక,విత్తనాల వినియోగం,ఎరువులు,పురుగుమందుల వాడకంలో శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. అనంతరం గ్రామ ప్రజలకు, రైతు లకు ఎల్‌నినో ప్రభావం వల్ల కలిగే వాతావరణ మార్పులు,పంటలపై వాటి ప్రభావం,తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వినీత్ గౌడ్,హెచ్ఎం భారతి,ఎండీ నజీర్,పంచాయతీ కార్యదర్శి రాకేష్,వార్డు సభ్యులు పబ్బతి విజయ, మంకాల మోహన్, నిషాని అనిల్,బుర్ర పద్మ,అంగన్‌వాడీ టీచర్లు అనురాధ, భూలక్ష్మి, కవిత, ఏఎన్ఎం సరోజ, ఆశ కార్యకర్త కవిత తదితరులు పాల్గొన్నారు.

# ఇథనాల్ ఫ్యాక్టరీలకు వ్యతిరేకంగా జూలై 29న బెజ్జంకి బంద్

- బంద్‌ని విజయవంతం చేయాలి
- మండల ప్రజలకు అఖిలపక్షం పిలుపు

**బెజ్జంకి,జూలై 24,(జనంసాక్షి):** బెజ్జంకి మండలం గుగ్గిళ్ల,పోతారం శివారులో ఏర్పాటు చేసిన ఇథనాల్ ఫ్యాక్టరీలను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న బెజ్జంకి మండల బంద్‌కు అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం బెజ్జంకి మండల కేంద్రం లో అఖిలపక్ష నాయకులు సమావేశమై బంద్‌కు సంబంధించిన కార్యాచరణను రూపొందించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లా డుతూ ఇథనాల్ ఫ్యాక్టరీల కారణంగా మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఫ్యాక్టరీల నుంచి వెలువడుతున్న దుర్వాసనతో పాటు నీటి కాలుష్యం,శబ్ద కాలుష్యం కారణంగా ప్రజల జీవనం ఇబ్బందికరంగా మారిందని అన్నారు. ప్రజల ఆరోగ్యం,పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఇథనాల్ ఫ్యాక్టరీ లను పూర్తిగా మూసివేసే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఇథ నాల్ ఫ్యాక్టరీల సమస్యపై ప్రభుత్వం,అధికారులు తక్షణమే స్పందించి ప్రజల ఆందోళనలను పరిష్క రించాలని డిమాండ్ చేశారు. జూలై 29న నిర్వ హించే బెజ్జంకి మండల బంద్‌కు ప్రజా సం ఘాలు, విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, విద్యాసంస్థలు, వాణిజ్య సంస్థలు, కుల సంఘాలు, అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా సహకరించి బంద్‌ను విజయవంతం చేయాలని అఖిలపక్ష



నాయకులు విజ్ఞప్తి చేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీల మూసివేతే లక్ష్యంగా ప్రజల హక్కుల కోసం ఐక్యం గా పోరాడుతామని నాయకులు ప్రకటించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, బీజేపీ, డీఎస్పీ, బీఎస్పీ తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# ప్రశ్నిస్తే లాఠీచార్జీనా? విద్యార్థుల గొంతు నొక్కేయాలనుకుంటున్నారా?

- ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జీని ఖండిస్తూ బెజ్జంకిలో విద్యాసంస్థల బంద్ విజయవంతం
- ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగెం మధు



**బెజ్జంకి,జూలై 24,(జనంసాక్షి):** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థి, యువజన సంఘాలపై పోలీసులు జరిపిన లాఠీచార్జీని తీవ్రంగా ఖండిస్తూ, ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా సమితి, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్ర వారం బెజ్జంకి మండల కేంద్రంలోని విద్యాసంస్థలను బంద్ నిర్వహించారు. బంద్‌కు విద్యార్థులు,విద్యాసంస్థలు సంపూర్ణంగా సహకరించడంతో బంద్ విజయవంతమైంది.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగెం మధు మాట్లాడుతూ ప్రశ్నించే విద్యార్థులపై ప్రభుత్వం పోలీసు బలగాలను ప్రయోగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు సమాధానం చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం లాఠీచార్జీ లతో ఉద్యమాలను అణచివేయాలని ప్రయత్నించడం దురదృష్టకరమని విమర్శించారు. దేశంలో 2014 నుంచి ఇప్పటి వరకు అనేక పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు వెలుగులోకి వచ్చాయని,వరుస పేపర్ లీకేజీలతో దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకుని,ఎన్నో ఆశలతో పోటీ పరీక్షలకు హాజరవుతుంటే ప్రశ్నపత్రాల లీకేజీల కారణంగా వారి భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.2026 నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పరీక్షల నిర్వహణ లో పూర్తి పారదర్శకత పాటించాలని,విద్యార్థులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి,యువజన సంఘాలు ఢిల్లీలోని జంతర్‌మంతర్ నుంచి పార్లమెంట్ వైపు శాంతియుతం గా చేపట్టిన నిరసన ప్రదర్శనను పోలీసులు అడ్డుకుని లాఠీచార్జీ చేయడం, పలువురు విద్యార్థి నాయకులను గాయపరచడం, అరెస్టు చేయడం ప్రజా స్వామ్యానికి మాయని మచ్చ అని అన్నారు. ప్రశ్నించే ప్రతి గొంతును బలవం తంగా అణచివేయాలని ప్రయత్నించడం దేశ భవిష్యత్తుకు ప్రమాదకర సంకే తమని హెచ్చరించారు. గాయాలు శరీరానికే– సంకల్పానికి కాదు.లాఠీలతో ఉద్యమాలను ఆపలేరు. విద్యాహక్కు కోసం, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఏఐఎస్ఎఫ్ పోరాటం నిరంతరం కొనసాగుతుంది అని సంగెం మధు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మిడి సాయి, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్, ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు రాకేష్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు బాబు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# యువత భవిష్యత్తును దోచుకుంటున్న పాలకులపై ఉద్యమిద్దాం

- బీజేపీ నిరంకుశ విధానాలు దేశానికి ప్రమాదకరం
- వనపర్తిలో ఘనంగా ఎఐవైఎఫ్ 3వ జిల్లా మహాసభలు
- కల్లూరు ధర్మేంద్ర, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి




**వనపర్తి బ్యూరో, జూలై 24 (జనంసాక్షి):** యువత భవిష్యత్తును దోచుకుంటున్న పాలకులపై ఉద్యమించాలని, బీజేపీ నిరంకుశ విధానాలు దేశానికి ప్రమాదకరమని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. ఎఐవైఎఫ్ వనపర్తి జిల్లా 3వ మహాసభ వనపర్తి లోని సిపిఐ కార్యాలయం కటికనేని గోపాల్ రావ్ భవన్ లో జిల్లా అధ్యక్షుడు మహేష్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. మహాసభల సూచికగా యువజన సంఘం జెండాను ఎఐవైఎఫ్ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సురేష్ ఎగురవేశారు.

ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్రలి. మాట్లాడుతూ వనపర్తి జిల్లా యువత నేడు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొం టోందన్నారు, నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో జాప్యం, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ విధానాలు, పరిశ్రమల కొరత, నైపుణ్యాభివృద్ధి అవకాశాల లేకపోవడం, రైతు కుటుంబాల యువత ఉపాధి కోసం వలస వెళ్లాల్సిన పరిస్థితి, ప్రభుత్వ విద్య,వైద్య రంగాల నిర్లక్ష్యం, గిగ్ వర్కర్ల దోపిడీ వంటి సమ స్యలు యువత భవిష్యత్తును చీకటిలోకి నెట్టుతున్నాయన్నారు . దేశవ్యాప్తంగా నీట్ పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విద్యార్థులకు న్యాయం, విద్యా వ్యవస్థ పరిరక్షణ కోసం ఢిల్లీలో కొనసాగుతున్న విద్యార్థి–యువజన ఉద్య మాలు దేశ యువత ఆవేదనకు ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. విద్యను హక్కుగా కాకుండా వ్యాపారంగా మార్చే విధానాలు, పరీక్షల నిర్వహణలో లోపాలు, విద్యార్థుల భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టే పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం వెంటనే బాధ్యత వహించి సమగ్ర సంస్కరణలు చేపట్టాలని ఐ వై ఎఫ్ డిమాండ్ చేస్తోందన్నారు. విద్యను కార్పొరేట్ లాభాల సాధనంగా కాకుండా రాజ్యాంగబద్ధమైన హక్కుగా పరిరక్షించాలన్నదే ఎఐవైఎఫ్ ఉద్య మాల ప్రధాన లక్ష్యమన్నారు. “శాంతి,అభ్యుదయం, శాస్త్రీయ సోషలిజం” అనే ఏఐవైఎఫ్ సిద్ధాంతాన్ని యువతలో విస్తృతంగా తీసుకెళ్లి, ప్రజా సమస్య లపై చైతన్యం పెంపొందిస్తూ ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. రాష్ట్ర మహాసభలు యువతకు సైద్ధాంతిక దిశానిర్దేశం చేసి, ప్రజా ఉద్యమాలను మరింత శక్తివంతం చేసే వేదికగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పరిస్థితుల్లో యువతను ఐక్యం చేసి, విద్య–ఉపాధి–సామాజిక న్యాయం కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేయడం ఎఐవైఎఫ్ తీసుకుందన్నారు. సెప్టెంబర్ 8,9,10 తేదీలలో యాద గిరిగుట్ట, యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేసి, వనపర్తి నుంచే ప్రజా ఉద్యమాల కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాలని వారు ఆకాంక్ష వ్యక్తం చేశారు.

ఈ మహాసభలో ఎఐవైఎఫ్ వనపర్తి జిల్లా కార్యదర్శి ఎండీ. కుతుబ్, సీపీఐ జిల్లా నేత, ఎఐవైఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు రమేష్,ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్,ఎఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు విష్ణు, మహబూబ్, పరమేష్, సంతోష్, ప్రసాద్, వెంకటేష్, అశోక్, మోహన్, శ్రీకాంత్, బాల కృష్ణ, మురళి, రాజేష్, భాను ప్రకాష్, వెంకట్ స్వామి, రాము, రామాంజ నేయులులతో పాటు వివిధ మండలాల నుండి కార్యకర్తలు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్రం విఫలం

• కాంగ్రెస్ పార్టీ యువజన జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ



**హత్నూర, జూలై 24 (జనంసాక్షి):** వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటి కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) పరీక్షలను నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ యువజన జిల్లా ప్రధాన కార్యదర్శి వరిగుంతం కృష్ణ ఆరోపించారు.రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ శుక్రవారం మండలంలోని దౌల్తాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద దేశ ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు.నీట్ పరీక్ష పేపర్ లీకేజీ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థుల పక్షాన నిలబడి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు.నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను వెంటనే తమ పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.పదే పదే నీట్ పరీక్ష పేపర్ లీకేజీతో పాటు,రద్దు చేస్తున్న కారణంగా విద్యార్థుల ఆత్మస్థైర్యం దెబ్బతినడంతో పాటు వారు ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోయే ప్రమాదముందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో సందీప్, కృష్ణారెడ్డి, సాయి, ప్రసాద్, అడ్డు, సతీష్, మహేందర్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## కాలుజారి వరినారు మడిలో పడి యువకుడి మృతి



**పుల్కల్, జూలై 24 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని కోడూరు గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన పెద్దబాబు గాలయ్య, రుక్కమ్మ దంపతుల చిన్న కుమారుడు మల్లేశం (35) శుక్రవారం పొలం పనులకు వెళ్లాడు. ఈ క్రమంలో వరి నారు మోస్తుండగా ప్రమాదవశాత్తు పొలం ఒరం పైనుంచి కాలుజారి వరినారు మడిలో పడిపోయాడు. పడిపోయిన సమయంలో మల్లేశం తల బురదలో చిక్కుకుపోవడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. కొంతసేపటి తర్వాత గమనించిన తోటి రైతులు, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని బయటకు తీసేలోపే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనతో కోడూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు స్థానికులను కలిచివేశాయి.

## మాలల హక్కులను కాలరాస్తున్న రోస్టర్ విధానాన్ని రద్దుచేయాలి



**నిజాంపేట,జూలై 24 (జనంసాక్షి):**
నిజాంపేట మండల కేంద్రంలో శుక్రవారం రోజున నియోజకవర్గ మాలల సమావేశం మాల సోదరులతో మాలల సమావేశం కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా దుబాసి సంజీవ్ మాట్లాడుతూ మాల ఉపకులాల హక్కులను కాలరాస్తున్న రోస్టర్ విధానాన్ని రద్దుకై డిమాండ్ చేస్తూ ఈనెల 27వ తేదీన సోమవారం నాడు రామాయంపేట శారద ఫంక్షన్ హాల్ లో నిర్వహించబోయే మాలల సమావేశానికి రామాయంపేట, నిజాంపేట, నార్సింగ్ చేగుంట శంకరంపేట మండలాల మాల బాంధవులు మాల సోదరులు ఈ సమావేశానికి హాజరై రోస్టర్ విధానం పైన అంశాలను తెలుసుకొని మన జాతి బిడ్డల కోసం మన జాతి ఉద్యోగాల కోసం మాట్లాడటం కొరకై సమావేశానికి తరలివచ్చి విజయవంతం చేస్తారని పిలుపునిచ్చారు. నేటి రోజు నిజాంపేట మండలంలోని కల్వకుంట నార్లాపూర్ తిప్పనగుల్ల, నందిగామ నిజాంపేట చల్మెడ నస్కల్ రాంపూర్ గ్రామాలలో నియోజకవర్గ మాలల సమావేశం కరపత్రాలను మాల పెద్దలకు మాల బాంధవులకు సంఘాలకు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టంకరి లక్ష్మణ్, లక్ష్మీ నరసింహులు, రాగుల బాబు, నవీన్, చంద్రం, రంజిత్, మహేష్, బ్యాగరి చంద్రం, వార్డు సభ్యులు రాజేష్, బాలపోచయ్య, లచ్చయ్య, కుంచెన రాజు, స్వామి, నరేష్, లక్ష్మీ నర్సు, వీరేష్, నరేష్, లచ్చన్న, స్వామి,తదితరులు పాల్గొన్నారు.

## దశదినకర్మకు హాజరైన ఎమ్మెల్యే



**శివ్వంపేట, జులై 24 (జనంసాక్షి):**
శివ్వంపేట మండలం చెన్నాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నార్లగల్ల వెంకట్ గౌడ్ దశదినకర్మ కార్యక్రమానికి మాజీ మంత్రి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి హాజరై నివాళి అర్పించారు. అతని కుమారుడు మాజీ ఆత్మ కమిటి సభ్యులు రాంచందర్ గౌడ్ ను, అతడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణాగౌడ్, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, సర్పంచ్ ఆకుల కొమురయ్య, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, బోళ్ల భిక్షపతి, రాజేందర్ నాయక్, రాజశేఖర్ గౌడ్, పూల అర్జున్, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.



## అందరి సహకారంతో హకింపేట అభివృద్ధి

• సర్పంచ్ దీప్తి కోటేశ్వరరావు

**వెల్దుర్తి, జులై 24 (జనంసాక్షి):**
వెల్దుర్తిమాసాయిపేట మండలాల్లో జోరుగా ఎన్ఆర్ఈజీఎస్ పనులు జరుగుతున్నాయి. రెండు మండలాల్లో 33 పాఠశాలలకు ప్రహరీగోడల నిర్మాణానికి నిధులు 3.30 కోట్లు వివో కార్యాలయల నిర్మాణలకు 2.80 కోట్ల నిధులు మంజూరైనట్లు మండల పిఆర్ ఎఈ పవన్ తెలిపారు. మాసాయిపేట మండలం హక్కింపేట రామంతపూర్ మాసాయిపేట వెల్దుర్తి మండలం వెల్దుర్తి నెల్లూరు హస్తాల్పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ గోడల నిర్మాణాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో భవనాలు ప్రహరీ గోడలనిర్మాణాలు పూర్తయ్యాయి హకింపేటలో సొంత డబ్బులు మూడు లక్షలతో గ్రామస్తులకు పోలాలకు ఇతర అవసరాలను తీర్చేందుకు మట్టి రోడ్డు వేయించినట్లు సర్పంచ్ దీప్తి కోటేశ్వరరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ నిధులతో గ్రామాల్లో కొంత మేరకు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయా గ్రామాల సర్పంచులు తెలిపారు.

## రాజానెల్లి ప్రభుత్వ పాఠశాలలో ఎంఆర్ఓ సుప్రియ ఆకస్మిక తనిఖీ

• విద్యార్థులతో నేలపై కూర్చొని సహ భోజనం



**కోహీర్, జులై 24 (జనం సాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీ ర్ మండల పరిధిలోని రాజా నెల్లి గ్రామంలో శుక్రవారం నాడు ఎంఆర్ఓ సుప్రియ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆమె, విద్యార్థుల బోధనా సదుపాయాలు, విద్యా నైపుణ్యాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థు లతో నేరుగా ముచ్చటించి, బాగా చదువుకొని ఉన్నత స్థానా లకు ఎదగాలని, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించిన ఎంఆర్ఓ, విద్యార్థులతో కలిసి నేలపై కూర్చొని సహ భోజనం చేశారు. భోజనం రుచిగా ఉందో లేదో విద్యార్థులను ఆరా తీసి, భోజనాన్ని ఎల్లప్పుడూ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, పరి శుభ్రమైన వాతావరణంలో వడ్డించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. సమయపాలన పాటిస్తూ విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని, పాఠ శాల సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అశ్విన్ ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# హామీలు నిలబెట్టుకోండి సీపీఎస్ రద్దు చేయండి

• పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి



**చేర్యాల/మద్దూరు, జూలై 24 (జనంసాక్షి):** ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని(ఓపీఎస్) తక్షణమే పునరుద్ధరించాలని పీఆర్టీయూటీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనా రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పీఆర్టీయూ టీఎస్ సిద్ధిపేట జిల్లా మద్దూరు మండల శాఖ ఆధ్వర్యంలో రేబర్తి, మద్దూరు, నర్సాయపల్లి, మోడల్ స్కూల్, కేజీబీవీ తదితర విద్యాసంస్థల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పీఆర్సీని వెంటనే ప్రకటించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ-2003 అభ్యర్థులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ ఉపాధ్యాయినులకు మినిమమ్ టైమ్ స్కేల్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న హెల్త్ కార్డుల సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ మద్దూరు మండల శాఖ అధ్యక్షుడు కామిడి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కరుణాకర్, రాష్ట్ర కార్యదర్శి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్ కుమార్, నాయకులు రమేశ్, వెంకటరాజం తదితరులు పాల్గొన్నారు.

# బీరంగూడ గుట్టపై వైభవంగా వరుణ యాగం



**అమీన్పూర్, జూలై 24 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖశాంతులు, సుభిక్షంతో జీవించాలని బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం కార్యనిర్వాహన అధికారి దేవదానం, ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం బీరంగూడ గుట్ట శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో వరుణ జపం, వరుణ హోమం, వరుణ యాగం మరియు ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.

ఆలయ కార్యనిర్వహణాధికారి దేవనాదం, ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రహ్లాద్ మరియు వారి బృందం వేద మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. యాగంలో భాగంగా ప్రత్యేకంగా 108 పవిత్ర కలశాలను ప్రతిష్ఠించి వరుణ జపం, వరుణ హోమం, రుద్రాభిషేకాలు, కలశాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు పూర్ణాహుతి నిర్వహించి రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఈ సందర్భంగా ఈఓ దేవనాదం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రకృతి సమతుల్యత నెలకొని సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని సంకల్పించి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ, నాల్గవ శతాబ్దానికి చెందిన చారిత్రాత్మక పుణ్యక్షేత్రమైన బీరంగూడ గుట్టలో స్వామివారి అనుగ్రహంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రైతులు ఆనందంగా ఉండాలని, ప్రజలందరికీ శాంతి, ఐశ్వర్యాలు కలగాలని సంకల్పించి వరుణ యాగం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సొంత నిధులతో మూడు గ్రామాల్లో త్రాగునీటి బోరు మోటార్ల ప్రారంభం చేసిన ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్



**హవేలీ ఘనపూర్, జూలై 24 (జనంసాక్షి):** హవేలీ ఘనపూర్ మండలంలోని ఔరంగాబాద్ తాండ, సుల్తాన్పూర్, బూరుగుపల్లి గ్రామాల్లో నెలకొన్న త్రాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన త్రాగునీటి బోరు మోటార్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఇంటికి సురక్షితమైన త్రాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడం తన బాధ్యతగా భావిస్తూ, గ్రామాల్లో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, తమ సమస్యను వెంటనే గుర్తించి పరిష్కరించినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎలినో ప్రభావంపై రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

- **ఆకునూరు గ్రామ సర్పంచ్ కొమ్ము రవి**
- **ఆకునూరులో రైతులకు అవగాహన సదస్సు**



**చేర్యాల, జూలై 24 (జనంసాక్షి):** ఆకునూరు గ్రామంలో పంటలపై ఎలినో ప్రభావంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు గ్రామ సర్పంచ్ కొమ్ము రవి, మండల వ్యవసాయ అధికారి ఎండి. అఫ్రోజ్, ఎంపీడీవో అనభేరి ప్రణయ్‌లు అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా ఎలినో ప్రభావం పంటలపై పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ సమయంలో రైతులు పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పంటలకు అధిక నీటి ఒత్తిడి లేకుండా చూసుకోవాలని, విత్తనాలు వేసే సమయంలో వాతావరణ సూచనలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. తెగుళ్లు, పురుగుల బారినుండి పంటను కాపాడేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ శాఖ సూచనల మేరకు ఎరువులు, పురుగు మందులు వాడాలని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, వాతావరణంలో మార్పులు వచ్చినప్పుడు ఆందోళన చెందకుండా, వ్యవసాయ అధికారులను సంప్రదించి తగు సలహాలు తీసుకోవాలని అధికారులు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మొహ్మద్ కరీమోద్దీన్, ఉప సర్పంచ్ కదారి పల్లవి-భాస్కర్, ఏఈఓ పూజ, వార్డు సభ్యులు అందె లక్ష్మీ, సూర అనిత, జూపల్లి కార్తిక్ రెడ్డి, తాటికొండ శేఖర్, భూమని భాస్కర్, ఘనపురం బాలనర్సమ్మ అంజయ్య, గ్రామ రైతులు, వ్యవసాయ,గ్రామ పంచాయతీ, అంగన్ వాడి టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

- **సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్**
- **కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఆకుల రాజు**
- **నీట్ పేపర్ లీకేజీపై సీపీఐ కాంగ్రెస్ నిరసనలు, తరగతుల బహిష్కరణ**



**చేర్యాల, జూలై 24(జనంసాక్షి) :** నీట్ పేపర్ లీకేజీ కి ప్రధాన కారణమైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆకుల రాజు గౌడ్ లు డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులను, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అరెస్టు చేసిన చర్యను తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు ప్రభుత్వ పాఠశాలలో కాంగ్రెస్, సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు తరగతులు బహిష్కరించారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆకుల రాజు గౌడ్ లు మాట్లాడుతూ.. విద్యార్థులు నిరుద్యోగులు ఎన్నో ఏళ్లుగా కోచింగ్ లు తీసుకుని ఎంతో కష్టపడి చదివి పరీక్షలు రాసే సమయంలో కేంద్ర ప్రభుత్వం కనుసన్నల్లో నీట్ పరీక్షా పేపర్ లీక్ కావడంతో దేశవ్యాప్తంగా 29 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతుందన్నారు. నీట్ పేపర్ లీకేజీపై సిబిఐ విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీతో పాటు నిరసన తెలుపుతున్న విద్యార్థి నాయకులను వెంటనే విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు సూర సంపత్, బోయిని మల్లేశం, ఘనపురం అంజయ్య, పొట్లపల్లి ప్రశాంత్,గద్దం ప్రవీణ్, పొరండ్ల చందు, కార్యకర్తలు,విద్యార్థులు పాల్గొన్నారు.

## హోంగార్డు కుటుంబాల సంక్షేమానికి అండగా ఉంటాం

- **మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా**
- **జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు**



**మెదక్ బ్యూరో, జూలై 24 (జనంసాక్షి):** జిల్లాలో ఇటీవల విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హోంగార్డు ఎం. శివరాం, గుండెపోటుతో మృతిచెందిన హోంగార్డు టీ.మహేందర్ కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కులను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అందజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మృతుల కుటుంబ సభ్యులకు ఎస్పీ చెక్కులను అందించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఎస్పీ వారి ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మృతుడు శివరాం కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఎస్పీ.. ఆయన పిల్లల చదువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బీటెక్ పూర్తి చేసిన శివరాం కుమారుడు ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న విషయం తెలుసుకుని, అతని విద్యార్హతలు, ఇతర వివరాలను సేకరించారు. ఉద్యోగం కల్పించే విషయంలో తనవంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే మహేందర్ భార్య ప్రస్తుతం ఎలాంటి ఉపాధి లేక ఇంటివద్దే ఉంటున్న విషయం తెలుసుకున్న ఎస్పీ.. ఆమె విద్యార్హతలు, ఉద్యోగ అవకాశాల గురించి ఆరా తీశారు. ఆమెకు ఉద్యోగం కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ తెలిపారు. కుటుంబ సభ్యుల సంక్షేమానికి అవసరమైన సహకారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఆర్ఐ శైలేందర్, ఆర్ఎస్ఐ నరేష్, రైటర్ శ్రావణ్, మృతుల కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వెల్దుర్తి ఎస్ఐని సన్మానించిన మంగళపర్తి పాలక మండలి

- **సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన**
- **బెల్ట్ షాపులపై ప్రత్యేక నిఘా సారించాలని కోరారు**
- **శాంతి భద్రతలు పరిరక్షణకే ప్రథమ లక్ష్యం**




**మనోహరాబాద్, జూలై 25(జనంసాక్షి):** వెల్దుర్తి మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన కరుణాకర్ రెడ్డిని సన్మానించిన మంగళపర్తి గ్రామ పాలకమండలి సైబర్ నేరాల నియంత్రణపై ముఖ్యంగా యువతకు ప్రత్యేక అవగాహన కల్పించాలని అదేవిధంగా మండలంలోని బెల్ట్ షాపులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. శాంతి భద్రతలకు పరిరక్షణకే ప్రథమ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంధ్యారామకృష్ణ రావు వార్డ్ సభ్యులు కుమ్మరి నర్సింలు, బుర్క సత్యనారాయణ, సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి దానిని పరిరక్షించాలి

- **మొక్కలు నాటిన సర్పంచ్, ఎంపీడీవో**



**చేర్యాల, జూలై 24 (జనంసాక్షి):** పచ్చదనాన్ని పెంపొందించేందుకు గ్రామ సర్పంచ్ కొమ్ము రవి ఆధ్వర్యంలో ఆకునూరు డబుల్ బెడ్ రూమ్ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కాలనీలోని ఖాళీ స్థలాల్లో పలు రకాల మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణలో మొక్కల ప్రాధాన్యతను సర్పంచ్ వివరించారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దానిని పెంచాలని, భావితరాలకు మంచి భవిష్యత్తును అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచించారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మొహ్మద్ కరీమద్దిన్,వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## పాలమూరులో జనసేన విస్తరణకు ముమ్మర కసరత్తు

- **ఆగస్టు 1న భారీ ర్యాలీ, బహిరంగ సభ**



**మహబూబ్‌నగర్, జూలై 24 (జనంసాక్షి):** ఆంధ్రప్రదేశ్‌లో కీలక రాజకీయ శక్తిగా ఎదిగిన జనసేన పార్టీ ఇప్పుడు తెలంగాణలోనూ విస్తరణపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కార్యాచరణ ప్రారంభించింది. పవన్ కళ్యాణ్ అభిమాన వర్గాన్ని పార్టీ బలంగా మలుచుకుంటూ మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని కేంద్రంగా చేసుకుని ముందుకు సాగుతోంది. పార్టీ ఇతర రాజకీయ పార్టీల్లో అసంతృప్తితో ఉన్న నాయకులు, వివిధ సామాజిక వర్గాల ప్రముఖులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. త్వరలో పలువురు నేతలు జనసేనలో చేరే అవకాశం ఉందనే ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

శుక్రవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో పార్లమెంట్ ఇన్‌చార్జి మేడ రామకృష్ణ మాట్లాడుతూ, ఆగస్టు 1న మహబూబ్‌నగర్ కేంద్రంగా భారీ ర్యాలీతో పాటు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఉమ్మడి జిల్లా బాధ్యుడిగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణ పాలమూరుకు కొత్త ముఖం కావడంతో, ఆయన నాయకత్వంలో జనసేన స్థానిక రాజకీయాల్లో ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశంపై ఆసక్తి నెలకొంది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి జనసేన ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని తెలిపారు. పార్టీ అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు తెలంగాణ, ముఖ్యంగా వెనుకబడిన పాలమూరు ప్రాంతంపై ప్రత్యేక అభిమానం ఉందన్నారు. తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నదే ఆయన ఆకాంక్ష అని పేర్కొన్నారు. పార్టీపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వంగా లక్ష్మణ్ గౌడ్, పి.ఆర్. రాఘవేందర్, ముకురాల కృష్ణ, మణికంఠ గౌడ్, రవీందర్ గౌడ్, శ్రీవాల్లి తదితర నాయకులు పాల్గొన్నారు.

## కేటీఆర్ జన్మదినాన విద్యార్థులకు 'గిఫ్ట్ ఎ స్మైల్'.. నగదు ప్రోత్సాహకాలు...





రామచంద్రపురం, జూలై25 (జనంసాక్షి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరు నియోజకవర్గంలో 'గిఫ్ట్ ఎ స్మైల్' కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొని కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గీత భూపాల్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ తొలి సంవత్సరంలో 95 శాతానికి పైగా మార్కులు సాధించిన 10 మంది, ద్వితీయ సంవత్సరంలో 95 శాతానికి పైగా మార్కులు సాధించిన 9 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. అలాగే, అదే కళాశాలకు చెందిన విద్యార్థిని ప్రతిభ కవే ఢిల్లీ యూనివర్సిటీలో బి.ఏ. ఆనర్స్ కోర్సులో ప్రవేశం పొందినా, హాస్టల్ ఫీజులు చెల్లించే ఆర్థిక ఇబ్బందులు ఉన్న విషయం తెలుసుకున్న ఆదర్శ్ రెడ్డి, ఆమె ఉన్నత విద్యకు తోడ్పాటుగా రూ.60 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డి, తొంట అంజయ్య, మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జిన్నారం వెంకటేష్ గౌడ్, కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## కొమురవెల్లి రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవానికి సామాన్యులకు ఆహ్వానం

చేర్యాల, జూలై24 (జనంసాక్షి): పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానంకు ప్రతి ఏటా 25 లక్షల మంది మొక్కులు తీర్చుకోవడానికి తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుండి రావడం భక్తులు వస్తుంటారు. కొన్ని ప్రాంతాలనుండి రావడానికి సరైన రవాణా సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కొమురవెల్లి రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయడంతో ఎన్నో దశాబ్దాలుగా భక్తులు, ఈ ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్న కల సాకారం కాబోతుంది. ఈ నెల 26వ తేదీ ఆదివారం కొమురవెల్లి రైల్వేస్టేషన్ రోజున కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రివర్యులు జి కిషన్ రెడ్డి ప్రారంభోత్సవం జరుగనున్న నేపథ్యంలో ఈ ప్రారంభోత్సవానికి సంబంధించి చేర్యాల మండల అధ్యక్షులు వడ్లకొండ సంజీవులు గౌడ్ ఆధ్వర్యంలో సామాన్య ప్రజలకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా సంజీవులు మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులోకి అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. సామాన్యుల సమస్యలు మధ్యతరగతి నుండి వచ్చిన మోడీకి తెలుసు కాబట్టే నిరంతరం వారి ఎదుగుదలకు,వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు.కొమురవెల్లి రైల్వేస్టేషన్ అందుబాటులో తీసుకురావడంతో మధ్యతరగతి ప్రజలకు,భక్తులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎషబోయిన మదేవులు, వడ్లకొండ వెంకటేష్, శ్రీపతి కమలేష్, గుంటి రాములు, పందుగ తిరుపతి, బింగి రాజు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి ఐక్యంగా కృషి చేయాలి

- ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యాదయ్య



జడ్చర్ల, జూలై 24 (జనంసాక్షి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలందరూ ఐక్యంగా, సైనికులా కష్టపడి పనిచేయాలని ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యాదయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేద్కర్ కళాభవనంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నూతన నియామక పత్రాల అందజేత కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఎద్ల చెన్నకేశవులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జడ్చర్ల ఎమ్మెల్యే మాతృమూర్తి శశికలమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యాదయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు పసుల రాజు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జడ్చర్ల టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మల్లికార్జున్‌ను నియమించి, ఆయనకు మరియు మండల ఉపాధ్యక్షులు, నూతన కార్యవర్గ సభ్యులకు జిల్లా అధ్యక్షులు పసుల రాజు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ సెక్రటరీ అశోక్ యాదవ్, జిల్లా స్పోర్ట్స్ పర్సన్ నిత్యానందం, జిల్లా జనరల్ సెక్రటరీలు ఎర్ర ఆనంద్, అనుప కృష్ణయ్య, మాజీ సర్పంచ్ చెన్నయ్య, మార్కెట్ డైరెక్టర్లు యాదయ్య, కాజా అలీయుద్దీన్, బంగారు యాకుబ్, సర్వరాజ్, లక్ష్మమ్మ, అరవిందమ్మ, రమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు బాలు, షాగంటి రఘు, తుంగ రఘు, గుండు వెంకటేశం, భరత్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

సంగారెడ్డి, జూలై 24 (జనంసాక్షి): సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆదేశాల మేరకు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి కేటీఆర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్ రెడ్డి,డాక్టర్ శ్రీహరి, చింత గోపాల్, కొండల్ రెడ్డి, నాగరాజు గౌడ్, రామప్ప, మల్ల గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి, మధుసూదన్ రెడ్డి, విఠల్, పెద్దగొల్ల ఆంజనేయులు, నాయకులు వేణుగోపాల స్వామి, కౌన్సిలర్లు లాడె మల్లేశం, పొన్న రాజేందర్ రెడ్డి, నవీన్, బీఆర్ఎస్‌వీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మాయిపల్లిలో ఎమ్మెల్యే హరీష్ రావు సహకారంతో హోటల్ ప్రారంభం

- గ్రామస్తులకు పరిశుభ్రతతో కూడిన నాణ్యమైన పదార్థాలు అందించాలి
- సర్పంచ్ చేర్యాల రాజు



నంగునూరు, జూలై 24(జనంసాక్షి): నంగునూరు మండల్ తిమ్మాయపల్లి గ్రామంలో చిరు వ్యాపారులను ప్రోత్సహించాలని సదుద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు గ్రామానికి చెందిన చేర్యాల శ్రీకాంత్‌కు హోటల్ సామాగ్రిని అందించడం జరిగింది. గ్రామంలో శుక్రవారం రోజు గ్రామ సర్పంచ్ చేర్యాల రాజు గ్రామస్తులతో కలిసి హోటల్ ప్రారంభించి మాట్లాడుతూ హోటల్ యజమాని శ్రీకాంత్ గ్రామస్తులకు పరిశుభ్రత కూడిన నాణ్యమైన ,స్వచ్ఛమైన ఆహార పదార్థాలను అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాదగిరి, మాజీ సర్పంచులు, లత-కృష్ణ మల్యాల నర్సింలు, యజమాని శ్రీకాంత్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## రూ.20 లక్షలతో శ్రీశక్తి భవన నిర్మాణానికి భూమిపూజ

- న్యాల్‌కల్ అభివృద్ధికి శ్రీకారం చుట్టిన సర్పంచ్ జ్యోతిలక్ష్మి

న్యాల్‌కల్, జూలై 24, (జనంసాక్షి): మండల కేంద్రమైన న్యాల్ కల్ నూతన సర్పంచ్ గ్రామ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. భారత రాష్ట్ర సమితి బలపరిచిన అభ్యర్థిగా పోటీచేసి ఘన విజయం సాధించిన సర్పంచ్ అభివృద్ధిపై దృష్టి సారించారు. శుక్రవారం జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ:20 లక్షలతో.. శ్రీ శక్తి భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రామకంఠం పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రం సమీపంలో నూతన భవనాల నిర్మాణానికి.. ఉప సర్పంచ్ సరోజ, ఏపీఎం ధన్ రాజ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.భాస్కర్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్ సిద్ది లింగయ్య స్వామి, పంచాయతీ రాజ్ ఏఈ మహేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డిలతో కలిసి సర్పంచ్ బేగరి జ్యోతిలక్ష్మి భూమిపూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం పాఠశాల ఆవరణలో పలు మొక్కలను నాటారు. వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో గ్రామాభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని సర్పంచ్ జ్యోతిలక్ష్మి పేర్కొన్నారు.



రూ:5 లక్షల నిధులతో.. పశు వైద్య కేంద్రం నుండి బీసీ బాలికల వసతి గృహం వరకు అధ్వానంగా మారిన కచ్చా మార్గాన్ని మొరం (మట్టి)వేసి రాకపోకలకు సౌకర్యంగా మార్చినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అధ్యక్షురాలు మల్లీశ్వరి, పార్టీల శ్రేణులు ప్రవీణ్ కుమార్, యూనుస్ ఖాన్, నూర్ అలీషా, ఇసాం పాటిల్, కాశప్ప, ఉమేష్, అంజి, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ, ఐకెపి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందాలి

- సహాయ కార్మిక కమిషనర్

కేటీదొడ్డి, జూలై 24(జనంసాక్షి): గద్వాల జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ రోజు భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న పథకాల పై జిల్లా వ్యాప్తంగా ఉన్న మీ సేవ నిర్వాహకులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో కార్మికుల నమోదు సభ్యత్వ సంక్షేమ పథకాలు, సహజ మరణం, ప్రమాద మరణం బీమా క్లెయిమ్‌లు, బీమా క్లెయిమ్‌లు, మీ సేవ ద్వారా దరఖాస్తుల సమర్పణ విధానం తదితర అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సహాయ కార్మిక కమిషనర్ వేణుగోపాల్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ శివ,

ఈ సందర్భంగా సహాయ కార్మిక కమిషనర్ శ్రీ వేణు గోపాల్ మాట్లాడుతూ, "ప్రభుత్వం అమలు చేస్తున్న నిర్మాణ కార్మిక సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడైన కార్మికుడికి అందేలా చూడాలి. మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు సక్రమంగా, త్వరగా పంపించాలి. కార్మికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సేవలు అందించడం మన బాధ్యత" అని అన్నారు.కార్మికులు తమ లేబర్ కార్డును తప్పనిసరిగా రెన్యూవల్ చేయించుకోవాలని, బీమా క్లెయిమ్‌లకు అవసరమైన పత్రాలతో వెంటనే దరఖాస్తు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా నిర్మాణ కార్మికులకు మెరుగైన సేవలు అందించడానికి మీ సేవ నిర్వాహకులు మరింత అవగాహనతో పనిచేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమం విజయవంతం



అయిజ, జూలై 24 (జనంసాక్షి):
అయిజ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మహబూబ్ పాషా, రఘు గౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా బియల్ఏలకు ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ కౌన్సిలర్లు మద్దిలేటి, సులోచనమ్మ, మైనర్ బాబు ముఖ్య అతిథులుగా హాజరై బి యల్ ఏ లకు కీలక సూచనలు చేశారు. సమావేశంలో ప్రతి బియల్ఏ తన బూత్ పరిధిలోని ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి కొత్త ఓటర్ల నమోదు, పేర్ల సవరణలు, చిరునామా మార్పులు, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు.అలాగే ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన ప్రతి ఓటరిని జాబితాలో నమోదు చేయించడం, ప్రతి ఓటు విలువను ప్రజలకు వివరించడం, ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో బి యల్ ఏ లు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.
ప్రతి అర్హుడికి ఓటు హక్కు ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి బలం" అనే నినాదంతో కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పట్టణ కౌన్సిలర్లు, బి యల్ ఏ లు, వార్డు ఇన్‌చార్జీలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



అమీన్పూర్, జూలై 24(జనంసాక్షి): వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ మెజారిటీతో రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం బీఆర్ఎస్ కార్యనిర్వాన అధ్యక్షుడు, మాజీ మంత్రి, కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ఐటీ రంగాన్ని విశ్వవ్యాప్తం చేయడంలో, పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి పథంలో నడిపించడంలో కేటీఆర్ కీలక పాత్ర పోషించారన్నారు. ఎన్నో దేశాల నుంచి భారీ పెట్టుబడులను తెలంగాణకు రప్పించి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిన మహనీయుడని కొని యాడారు. కేటీఆర్ మరిన్ని పుట్టినరోజులు జరుపుకుంటూ, ప్రజలకు మరింత సేవ చేసేలా దేవుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎన్ఎస్జీ యువ సేన సభ్యులు అధిక మున్సిపాలి సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



మక్తల్, జూలై 24 (జనంసాక్షి): బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ 50వ జన్మదిన వేడుకలను మక్తల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. మక్తల్ పట్టణంతో పాటు నియోజకవర్గం లోని పలు మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు వేడుకలు జరుపు కున్నారు. మక్తల్‌లోని శ్రీ పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా చిట్టెం రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేటీఆర్ విశేష సేవలు అందించారని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని, కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో వెనుకబడిందని విమర్శించారు. రైతు సంక్షేమ పథకాలు నిర్లక్ష్యానికి గురయ్యా యని ఆరోపిస్తూ, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలని అన్నారు. కేటీఆర్‌కు ఆయురారోగ్యాలు, మరింత శక్తి ప్రసాదించాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్ర మంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్వైకల్ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పనిసరి



తెల్కపల్లి, జూలై 24, (జనంసాక్షి): 14 ఏళ్లు నిండిన ప్రతి బాలిక తప్పనిసరిగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, స్థానిక వైద్యాధి కారి డాక్టర్ సురేష్ బాబు సూచించారు. సర్వైకల్ క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఎంతో ప్రభావవంతమైనదని ఆయన తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని రాకొండ కేజీబీవీ గురుకుల పాఠ శాలలో నిర్వహించిన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 30 మంది విద్యార్థినులకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ, భవిష్యత్తులో సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా రక్షణ కల్పించే ఈ వ్యాక్సిన్‌ను ప్రభుత్వం ఉచితంగా అంది స్తున్నందున, అర్హులైన ప్రతి బాలిక ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాశ్, హెల్త్ సూపర్‌వైజర్లు వీర్‌పాల్, యశోద, ల్యాబ్ టెక్నీషియన్ రామాంజనేయులు గౌడ్, ఏఎన్ఎం రేణుక, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

- వీరన్నపేట అభివృద్ధి పనులకు నిధులు కోరిన కొండపాక



చేర్యాల, జులై24 (జనంసాక్షి): భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి శుక్రవారం తన జన్మదినాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని ఆయన నివాసం లో పలువురు నాయకులు, అభిమానులు కలిసి పుట్టినరోజు శుభాకాంక్ష లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఎంపిని కలిసి వీరన్నపేట గ్రామ అభివృద్ధికి సంబంధించిన కీలక సమస్యలపై వినతి పత్రం అందజేశారు. వీరన్నపేట-చుంచనకోట మధ్యలో బీటీ రోడ్డు పనులకు వెంటనే నిధులు మంజూరు చేయాలని, అలాగే వీరన్నపేట గ్రామానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కోసం నిధులు కేటాయించాలని వినతి పత్రంలో కోరారు. గ్రామ ప్రజల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఎంపిని విజ్ఞప్తి చేశారు. ఎంపి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారు లతో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

## భూతపం పెరగకుండా చెట్లను పెంచాలి

- సర్పంచ్ ఇంద్రసేన గౌడ్



అయిజ, జులై 24 (జనంసాక్షి): అయిజ మండలం సింధనూరు గ్రామంలో రైతుల కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక గ్రామసభలో ఎల్ నినో ప్రభావం గురించి వివరించారు. వాతావరణ ప్రభావం వల్ల వర్షాలు సరిగ్గా లేనందున వ్యవసాయ అధికారి జనార్దన్ రైతులకు ఆరుతడి పంటలకు సూచన చేశారు. కార్యక్రమంలో మండల ఎంపీడీఓ,భాస్కర్ యాదవ్, గ్రామ ఉప సర్పంచ్ సి,గోపాల్, టెక్నికల్ అసిస్టెంట్ ప్రభాకర్ ,ఏ ఈ ఓ స్వాతి రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ ప్రవీణ్ కుమార్, జీపి ఓ,హనుమయ్య , గ్రామ రైతులు ప్రజలు పాల్గొన్నారు. అలాగే గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఎంపీడీవో గ్రామంలో రోడ్లను, డ్రైనేజ్ వ్యవస్థను, ఇందిరమ్మ ఇల్లు పరిశీలించి మంజూరు చేయాలని, గ్రామ సర్పంచ్ కోరారు.

## పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- మండల విద్యాధికారి జనార్దన్ రెడ్డి



మద్దూరు, జూలై 24 (జనంసాక్షి): మద్దూర్ మండల పరిధిలోని రెనివట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రోజు పదవ తరగతి విద్యార్థుల యొక్క తల్లిదండ్రులచే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి జనార్దన్ రెడ్డి, పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అనిత, ప్రధానోపాధ్యా యులు రాజు నాయక్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తల్లిదండ్రులు పలు సూచనలు అందించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్ లో భాగంగా ఎక్ పేడ్ మాకే నామ్ లో 10వ తరగతి విద్యార్థుల వాళ్ళ తల్లి పేరుపై మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి లో ఇష్టపడి చదివి జిల్లా స్థాయి మార్కులను సాధించి మీ పాఠశాల కు గ్రామానికి మంచిపేరు తీసుకుని రావాలని, మండలంలో పదవ తరగతి లో 550 మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రతి ఒక్కరికి వేయి రూపాయలు అందిస్తానని మండలంలో ఎంతమందికి వచ్చిన అంతమందికి అందిస్తానన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం వీరయ్య, బాలరాజు, బ్రహ్మయ్య, సాయి కుమార్, రాజేష్, కృష్ణ, దేవమ్మ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యుత్ డీఈ శ్రీనివాస్‌కు ఘన స్వాగతం



న్యాల్‌కల్, జూలై 24, (జనం సాక్షి): జహీరాబాద్ నియోజక వర్గం డివిజన్ విద్యుత్ డీఈ గా నూతనంగా విధుల్లో చేరిన శ్రీనివాస్‌కు విద్యుత్ అధికా రుల సిబ్బంది ఘన స్వాగతం పలికి సత్కరించారు. సంగా రెడ్డి డీఈగా విధులు నిర్వహి స్తూ.. జహీరాబాద్ డివిజన్‌కు డీఈగా బదిలీ అయ్యారు. శుక్రవారం న్యాల్ కల్ మండల విద్యుత్ అధికారి అర్జున్ రావు, విద్యుత్ సిబ్బంది కలిసి జహీరాబాద్ పట్టణంలోని ప్రధాన విద్యుత్ కేంద్రం కార్యాలయంలో స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## వన మహోత్సవం ప్రారంభించిన సర్పంచ్ దేవన్నగారి శేఖర్





కొల్చారం, జూలై 24(జనంసాక్షి):రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని పెంచి, ఆకుపచ్చ తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని కొల్చారం గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దేవన్నగారి శేఖర్ మొక్కలు నాటి, గ్రామ ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొల్చారం ఉపసర్పంచ్ కోరంపల్లి రాణి గోపి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, కారోబార్ ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ అజామ్, పంచాయతీ వార్డు సభ్యులు కృష్ణ, అంజనిపుత్ర, శేకులు, వనమాల శ్రీధర్, నేరెళ్ల సత్యనారాయణ, ప్రవీణ్, చింతల కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గండీడ్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకలు



గండీడ్, జూలై 24(జనంసాక్షి): బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, యంగ్ డైనమిక్ లీడర్ కేటీఆర్ జన్మదిన వేడుకలను గండీడ్ మండల వ్యాప్తంగా పార్టీ నాయ కులు, కార్యకర్తలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మం డలంలోని పలు గ్రామాల్లో పార్టీ శ్రేణులు కేకులు కట్ చేసి కేటీఆర్‌కు జన్మ దిన, శుభాకాంక్షలు తెలిపారు.ఈసందర్భంగా ఉమ్మడి గండీడ్ మండల,మాజీ జెడ్పిటిసి,శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ,రాష్ట్ర అభివృద్ధిలో కేటీఆర్ అందిస్తున్న సేవలు యువతకు ఆదర్శమని కొనియాడారు.పార్టీ బలోపేతానికి ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.మండల వ్యాప్తంగా జరిగిన వేడుకల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పి టిసి శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెంట్యానాయక్, జిన్నా రం గోపాల్,హన్మంత్,మహేష్ రెడ్డి,గురల చెన్నయ్య, వెంకట్రాంరెడ్డి,బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చలో ఇందిరా పార్క్‌కు బయలుదేరిన బీఆర్ఎస్వీ నాయకులు



తెల్కపల్లి,జూలై 24 (జనంసాక్షి): ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ అంశంపై శాంతి యుతంగా నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై లాఠీచార్జ్ చేయ డాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఆదేశాలపై మండల బీఆర్ఎస్వీ నాయకులు శుక్రవారం చలో ఇందిరాపార్క్‌కు బయలుదేరారు.

ఈ సందర్భంగా టౌన్ అధ్యక్షుడు భాషమోని సత్యం మాట్లాడుతూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మరాజు, సాయికుమార్, రాకేష్, శివశంకర్, నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల సమస్యలపై ఎమ్మెల్యేకి వినతి



జడ్చర్ల, జూలై 24 (జనంసాక్షి): జడ్చర్ల మండలంలో బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ ట్రస్మ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే జె.అనిరుధ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఆర్టీఐ చట్టం పేరుతో కొందరు పాఠశాలలను ఇబ్బంది పెడుతున్నారని, వాటి నిర్వహణకు తీవ్ర ఆటంకం కలుగుతోందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రైవేట్ పాఠశాలల రక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని, ఇతర సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్మ జిల్లా అధ్యక్షులు అయ్యూబ్ అహ్మద్ ఖాన్, పట్టణ అధ్యక్షులు నరేష్, విష్ణు, గోవర్ధన్, గోపీనాథ్, సందీప్, బాలరాజు, రవీందర్ రెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## కోనేటిలో పడి డ్రైవర్ దుర్మరణం

- గోపాల్‌పేటలో విషాదం.. ఆలయం సమీపంలో ఘటన



గోపాల్‌పేట, జూలై 24 (జనంసాక్షి): గోపాల్‌పేట మండల కేంద్రంలో శుక్రవారం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎండి. నజీర్ (43), వృత్తిరీత్యా డ్రైవర్, ప్రమాదవశాత్తు కోనేటిలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, శుక్రవారం ఉదయం సుమారు 8:30 గంటల సమయంలో గ్రామంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం సమీపంలోని కోనేటి వద్దకు వెళ్లిన నజీర్ ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. స్థానికులు గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం బంధువులు, గ్రామస్థులు కలిసి వెతకగా ఆయన మృతదేహం కోనేటిలో లభ్యమైంది. మృతుడి మేనల్లుడు ఎండి. మహమూద్ (32) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై ఎలాంటి అనుమానాలు లేవని, ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని సబ్‌ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, తదుపరి విచారణ కొనసాగుతున్నట్లు తెలిపారు.

### నాగల్‌కడుమూర్‌లో

## బి.ఎస్.పి బూత్ కమిటీ ఎన్నిక



అమరచింత, (జనంసాక్షి): మండల పరిధిలోని చిన్న కడుమూరు గ్రామంలో బి.ఎస్.పి పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రకాష్ మక్తల్ నియోజకవర్గం ఇన్చార్జి అశోక్ కుమార్ ఆత్మకూరు మండలం అధ్యక్షులుగా గుడిసె శ్రీనివాసులు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. బూత్ కమిటీ అధ్యక్షులుగా ముష్టిపల్లి కురుమన్న బండారి మధు గౌరవ అధ్యక్షులుగా సప్లై వెంకటేష్ చిట్టి లక్ష్మన్న కార్యదర్శిగా రాజును పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది.


### కస్తూర్బా గాంధీ

## బాలికల విద్యాలయానికి బురదు దారి



రాజాపూర్,జూలై24(జనంసాక్షి): రాజాపూర్ మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి వెళ్ళేదారి బారి గుంతలతో, బురదమయంగా మారింది. ఈ రహదారిపై నిత్యం అక్రమ ఇసుకను తరలించే, ట్రాక్టర్లు,టిప్పర్లే దీనికి కారణమని తెలుస్తోంది. కస్తూర్బా గాంధీ విద్యాలయం వెంచర్‌కు పక్కనే ఉండటంతో వెంచర్ రోడ్డు పైనే విద్యాలయం ఉపాధ్యాయులు, విద్యార్థినులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పలు సమస్యలు ఉన్నా, రహదారి కూడా ఇలా మారడంతో ప్రభుత్వ విద్యాలయాలంటేనే ఇంత నిర్లక్ష్యం చేస్తున్నా అధికారులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## స్పోర్ట్స్ స్కూల్‌కు అక్కాచెల్లెలు ఎంపిక





అమరచింత, ఆత్మకూర్ (జనంసాక్షి): శుక్రవారం మండలంలోని ఆత్మకూరు పట్టణానికి చెందిన ఎండి రఫీ. ఇద్దరు కుమార్తెలు సాదియా బేగం, సానియా బేగం తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేటకు ఎంపికయ్యారు. ఉర్దూ మీడియం పాఠశాలలో చదువుతున్న వీరు ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చూపారు. సాదియా బేగం నాలుగో తరగతి సానియా బేగం అయిదవ తరగతిలో ప్రవేశానికి ఎంపికయ్యారు ఇద్దరు ఒకే పాఠశాలకు ఎంపిక కావడంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

## ఘనంగా ఎంపీపీఎస్ పాఠశాల ప్రారంభం



నాగర్‌కర్నూల్, జూలై24 (జనంసాక్షి): నాగర్‌కర్నూల్ మండలం పెద్దముద్దునూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎంపీపీఎస్ పాఠశాలను ఘనంగా ఎమ్మెల్యే డాక్టర్. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి తో కలిసి ప్రారంభించారు. చిన్న జీయర్ స్వామిజీ పాఠశాల ప్రారంభించిన అనంతరం ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు హాజరై పాఠశాల ప్రారంభాన్ని ఆనందంగా జరుపుకున్నారు. విద్యా రంగం అభివృద్ధి పట్ల తమ కట్టుబాటును మరోసారి చాటుతూ, ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, మునిసిపల్ చైర్మన్ సునేంద్ర, కౌన్సిలర్స్, మండల అధ్యక్షులు, నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి ఓటు 'సర్'లో

## నమోదు కావాలి: ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



తెలకపల్లి, జూలై 24, (జనంసాక్షి): ప్రతి ఓటు సర్ ప్రక్రియలో తప్పనిసరిగా నమోదు అయ్యేలా బీఎల్‌ఏలు, బీఎల్‌వోలు సమన్వయంతో పనిచేయాలని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల బీఎల్‌ఏలు, బీఎల్‌వోలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని అన్నారు. ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించి "సర్" ప్రక్రియలో నమోదు చేయాలని, ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్, ప్రజాప్రతినిధులు, బీఎల్‌ఏలు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ ప్రవర్తన ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

- బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం



మిడ్జిల్, జూలై 24 (జనంసాక్షి): మండల అధ్యక్షుడు నరేష్ నాయక్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ ప్రవర్తనను రచిస్తూ బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు శుక్రవారం ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ఆవరణలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ ఒకటి పండించి దగ్ధం చేశారు సందర్భంగా బిజెపి నాయకులుజిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, యువ మోర్చా జిల్లా మాజీ అధ్యక్షులు పల్లె తిరుపతి. మాట్లాడుతూ, ప్రజాస్వామ్యం దేవాలయంగా భావించే పార్లమెంట్ సమావేశాలు కొనసాగుతున్న సమయంలో, దేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధికారిక నివాసం ఎదుట ధర్నా నిర్వహించడం అత్యంత బాధ్యతారాహిత్యమైన, అనుచితమైన మరియు ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విరుద్ధమైన చర్య అని నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. మండల కేంద్రంలో రాహుల్ గాంధీ వైఖరిని నిరసిస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. నీట్ (NEET) పరీక్షల నిర్వహణకు సంబంధించిన సున్నితమైన అంశాలను కేవలం రాజకీయ లబ్ధి కోసం వినియోగిస్తూ ప్రజల అసలు సమస్యలను పక్కదారి పట్టించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోంది. దేశ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న వ్యక్తి ప్రజాస్వామ్య విలువలను, పార్లమెంటరీ వ్యవస్థను మరియు రాజ్యాంగబద్ధమైన సంప్రదాయాలను గౌరవిస్తూ తన అభిప్రాయాలను పార్లమెంట్ వేదికగా వ్యక్తపరచాల్సిన బాధ్యత ఉంది. అలా కాకుండా ప్రధానమంత్రి నివాసాన్ని ముట్టడించే విధంగా నిరసనలు చేపట్టడం ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల రాహుల్ గాంధీకి ఉన్న నిర్లక్ష్యాన్ని ప్రతిబింబిస్తోంది."అని నాయకులు అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువల సంరక్షణే ధ్యేయంగా నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షులు నరేందర్, ప్రధాన కార్యదర్శి వాసుదేవ్ శేఖర్, మండల ఉపాధ్యక్షులు ఎల్లయ్య, కిసాన్ మోర్చా మండలాధ్యక్షులు చిర్ర శేఖర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు శేఖర్,శాహజాది బేగం,పిఎసిఎస్ డైరెక్టర్ భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

### డీలర్ల సమావేశానికి

## తప్పనిసరిగా హాజరు కావాలి

- ఈ-కేవైసీ పూర్తి, మూడు నెలల బియ్యం పంపిణీపై చర్చ
- తహసీల్దార్ అద్దంకి సునీత



ఉప్పునుంతల, జూలై 24 (జనంసాక్షి): ఉప్పునుంతల తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు ప్రజా పంపిణీ వ్యవస్థ (రేషన్) డీలర్ల సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అద్దంకి సునీత ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డుదారుల ఈ-కేవైసీ ప్రక్రియను ఇంకా పూర్తి చేయని వారందరూ వెంటనే పూర్తి చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. ప్రభుత్వం మూడు నెలలకు సరిపడా బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయనున్న నేపథ్యంలో, పంపిణీ విధానం, ఈ-కేవైసీ పూర్తి, ఇతర పరిపాలనా అంశాలపై డీలర్లకు సమావేశంలో దిశానిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు. మండల పరిధిలోని ప్రజా పంపిణీ వ్యవస్థ డీలర్లు అందరూ నిర్ణీత సమయానికి సమావేశానికి తప్పనిసరిగా హాజరై, ప్రభుత్వ మార్గదర్శకాలను తెలుసుకుని వాటిని సమర్థవంతంగా అమలు చేయాలని ఆమె కోరారు.

### పంట మార్పిడి పై

## రైతులకు అవగాహన కల్పించాలి



ఇటిక్యాల, జూలై 24 (జనంసాక్షి): పంట మార్పిడి విధానంపై రైతులకు వివరించి ఆరుతడి పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని ఎంపిడిఓ రమాదేవి అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని గోపలదిన్నె, బుద్దారెడ్డిపల్లి మొగిలి రావులచెరువు గ్రామాలలో జరిగిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా వాతావరణం మార్పులను దృష్టిలో ఉంచకొని పంటలను సాగు చేయాలన్నారు. పంట సాగులో వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ అధిక దిగుబడి సాధించేలా చూడాలన్నారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనము పరిశీలించారు.

## అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం: ఎమ్మెల్యే



**పాపన్నపేట, జూలై 24 (జనంసాక్షి):** బాధిత కుటుంబాలకు బాసటగా నిలుస్తామని మెదక్ ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. ఇటీవల పోడ్చన్‌పల్లి గ్రామంలో విద్యుదా ఘాతంతో మృతి చెందిన ఎర్ర కిష్టయ్య, రోడ్డు ప్రమాదంలో మరణించిన పాపన్నపేటకు చెందిన కటిక రషీద్, డ్రైవర్ మరెల్లి రాములు కుటుంబ సభ్యులను, గాయపడిన కటిక గౌస్‌ను శుక్రవారం వారి ఇంటివద్ద పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యుల పిల్లల చదువు, కుటుంబ జీవన పరిస్థితి,సమస్యలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడొద్దు అండగా ఉంటామని భరోసా నిచ్చారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్య క్షుడు నరేందర్ గౌడ్,సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు నీరుడి వెంకటేశం, సర్పంచులు.. శ్రీనివాస్, అంజయ్య, శ్రీధర్, శ్రీశైలం, సిద్దిరాం రెడ్డి, ఉపసర్పంచ్ సద్దాంహుస్సేన్,నాయకులు ప్రభాకర్ రెడ్డి,మల్లప్ప,కిష్టయ్య,భరత్ గౌడ్, ఇబ్రహీం, ఖలీమ్,గౌస్, నాని,రమేష్, గణేష్, సంగమేశ్వర్ తదితరులు ఉన్నారు.

## కోహెడ మండల కేంద్రంలో జెపిఎస్‌ఆర్ జన్మదిన వేడుకలు



**కోహెడ, జూలై 24(జనంసాక్షి):** వృక్ష ప్రసాద ధాత బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపు రెడ్డి సురేందర్ రెడ్డి (జెపిఎస్‌ఆర్) జన్మదిన వేడుకలను శుక్రవారం కోహెడలో సామాజిక కార్యకర్త పిడిశెట్టిరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. అనంతరం రాజు మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రతి వేసవి కాలంలో ప్రజలకు కూలింగ్ ఫ్రిజ్‌ల ద్వార లక్షల రూపాయలను వెచ్చించి ప్రజల దాహార్తిని తీర్చుతున్న గొప్ప మనుసున్న నేత, వేల సంఖ్యలో మొక్కలను సంక్రాంతి పర్వదినాన కొత్తకొండ జాతరలో వృక్షప్రసాదంగా అందిస్తున్న వృక్షప్రసాద ధాత ఇలాంటి ఎన్నో సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఇలాగే మరెన్నో పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని, అలాగే ఉన్నత పదవులు చేపట్టాలని ఆ భగవంతుణ్ణి వేడుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త, వేల్పుల శంకర్ అంబేద్కర్ సంఘం మాజీ అధ్యక్షుడు మంద మల్లేశం, బీసీ జనసేన రాష్ట్ర నాయకులు గోవిందు సురేష్ నేత, జెఎస్‌ఆర్ అభిమానులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చేర్యాలలో అధిక ధరలకు డీఏపీ విక్రయాలు : రైతు సంఘం ఆగ్రహం



- చర్యలు తీసుకోవాలని జిల్లా అధ్యక్షుడు కత్తుల భాస్కర్ రెడ్డి డిమాండ్

**చేర్యాల, జూలై 24 (జనంసాక్షి):** చేర్యాల మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపుల్లో డీఏపీ ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కత్తుల భాస్కర్ రెడ్డి ఆరోపించారు. రూ.1350 విక్రయించాల్సిన డీఏపీ బస్తాను 1800 నుండి 2000 రూపాయల వరకు అమ్ముతున్నారని మండిపడ్డారు. వ్యవసాయ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం చేర్యాలలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఫర్టిలైజర్ షాపుల యజమానులు కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. వ్యవసాయ అధికారుల కనుసైగల్లోనే ఈ అక్రమాలు జరుగుతున్నాయని అనుమానం వ్యక్తం చేశారు.రైతులను ఆదుకునే సమయంలోనే ఇలా దోపిడీ చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అధిక ధరలకు డీఏపీ విక్రయిస్తున్న ఫర్టిలైజర్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని, చేర్యాలకు కేటాయించిన డీఏపీ బస్తాలను రైతులకు అందుబాటు ధరలో అందించేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రైతులకు అండగా ఉండాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధిలో సిబ్బంది సేవలు అమూల్యమైనవి

- వెల్దండ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్



**వెల్దండ, జూలై 24 (జనంసాక్షి):** మండల కేంద్రంలో వెల్దండ గ్రామ పంచాయతీ సిబ్బందికి శుక్రవారం గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ చేతుల మీదుగా శానిటేషన్ కిట్టు మరియు దుస్తువుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధిలో పంచాయతీ సిబ్బంది సేవలు అమూల్యమైనవని, గ్రామ పరిశుభ్రత కోసం పారిశుధ్య కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీవో గిరి గౌడ్, ఉప సర్పంచ్ ఎర్ర శ్రీనివాస్, వార్డు సభ్యులు, నాయకులు పాలాది మల్లీశ్వరి రంగనాథం, గుద్దటి కిష్టల్, పసునోజు వాణి పురుషోత్తం,కొండల్,ముదికొండ కవిత రమేష్, మసిగుండ్ల వెంకటేష్, మరిపల్లి మంజుల శ్రీను,జంగిలి సునీత ఆనంద్, పిల్లి దేవేందర్, సిరిసినగండ్ల శేఖర్, గోపిరెడ్డి రాఘవరెడ్డి,రేవల్లి శోభ రాజు, గ్రామ పెద్దలు, గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అడ్డాకల్ మండలంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పర్యటన

- పొన్నకల్ గ్రామంలో రీ-సర్వే పనుల పరిశీలన
- తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష





**అడ్డాకుల, జూలై 24 (జనంసాక్షి):** అడ్డాకల్ మండలంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పర్యటించి పొన్నకల్ గ్రామంలో జరుగుతున్న నాన్ కెడస్టల్ భూములరీ-సర్వే పనులను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రం తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్ ఫైళ్ళను తనిఖీ చేశారు.ముందుగా పొన్నకల్ గ్రామాన్ని సందర్శించి గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే పనులను పరిశీలించి, గ్రామ సరిహద్దుల నిర్ధారణ ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పొన్నకల్-రాచాల గ్రామాల మధ్య ఉన్న సరిహద్దు రేఖ (బౌండరీ లైన్) రీ-సర్వే ప్రక్రియను కలెక్టర్ మ్యాప్ ద్వారా ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రాచాల, పొన్నకల్ గ్రామాల రైతులు, గ్రామస్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, గ్రామస్థుల సహకారంతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రీ-సర్వే సందర్భంగా తలెత్తే సాంకేతిక సమస్యలు లేదా గ్రామస్తులకు ఉన్న సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని, పూర్తి అవగాహన కల్పిస్తూ ఎలాంటి వివాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయం ముందు ఉన్న కోనేరు శిథిలావస్థకు చేరుకోవడంతో, దానిని పునర్నిర్మించాలని గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు జిల్లా కలెక్టర్‌ను కోరారు. కోనేరు పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్, సంబంధిత అధికారులతో చర్చించి సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం అడ్డాకల్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, భూభారతి, మీ సేవ, సాధారణ దరఖాస్తులకు సంబంధించిన పెండింగ్ ఫైళ్లపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా 60 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించి ప్రజలకు సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏ.డి. అశోక్, అడ్డాకల్ తహసీల్దార్ కె. శేఖర్, మండల స్థాయిలో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సుల్తాన్‌పూర్‌లో హరితోత్సవం ఇంటింటికీ మొక్కల పంపిణీ





**చౌట్కూర్, జూలై 24 (జనంసాక్షి):** మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామపంచాయతీలో శుక్రవారం పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా గ్రామంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఇంటికీ పండ్ల, పూల మొక్కలతో పాటు వేప తదితర రకాల మొక్కలను మహిళలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో కే. శంకర్ హాజరై మొక్కల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కాపాడటంలో మొక్కల పాత్ర కీలకమన్నారు. ప్రతి కుటుంబం తమకు అందించిన మొక్కలను నాటడమే కాకుండా, వాటిని బాధ్యతాయుతంగా సంరక్షించాలని సూచించారు. నేడు మనం నాటే మొక్కలే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమం అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా ఆయన పాఠశాలలోని క్లాస్ రూమ్‌లను, విద్యార్థుల మూత్రశాలలను స్వయంగా పరిశీలించి, వాటి నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యతనిస్తూ పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ అత్యంత పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు, సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గీతా రమేష్, ఏపీ రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శి పావని, ఫీల్డ్ అసిస్టెంట్ కిషన్, ఉపసర్పంచ్ మహేష్, శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పెద్దలు, స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాభివృద్ధితో పాటు పర్యావరణాన్ని రక్షించుకోవడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు.

## ప్రాథమిక విద్యా సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

- మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రంగి కృష్ణ



**వెల్దుర్తి, జూలై 24 (జనంసాక్షి):** మండలంలోని శెట్టిపల్లి కలాన్ కుకునూర్ మన్నె వారి జలాల్పూర్,శేరిలాగ్రామాలలో ఫ్రీ ప్రైమరి పాఠశాలలు మంజూరు అయినప్పటికీ ఇప్పటివరకు టీచర్, ఆయానియమించలేరని మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు మన్నెవార్ జిలాల్పూర్ గ్రామ సర్పంచ్ రంగీ కృష్ణ తెలిపారు. దీంతో ప్రాథమిక విద్య పతిష్టతపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందన్నారు విద్యార్థులు గ్రామస్తుల చొరవతో అలాగే ఉపాధ్యాయుల కృషితో అన్ని గ్రామాల సర్పంచులు విద్యార్థులను స్కూల్లో జాయిన్ చేయడం జరిగింది ఇప్పటివరకు 40 రోజులు కావస్తున్న టీచర్ ఆయాని ఇవ్వకపోవడం పిల్లలకి చాలా ఇబ్బంది కలిగిస్తుంది ప్రభుత్వం మంచి లక్ష్యంతో గ్రామాలలో ఇంగ్లీష్ విద్య పట్ల మంచి ఆలోచన చేసిందని అందరం సంతోషించాం కానీ ఇప్పటివరకు ప్రతి స్కూల్లో ప్రవేట్ స్కూల్ లకు వెళ్లే విద్యార్థులను వాళ్ళ తల్లిదండ్రులను ఒప్పించి విద్యార్థులను జాయిన్ చేయడం జరిగింది ఒక్కో స్కూల్లో పిల్లలు ఇబ్బందులు పడడం చూసి తల్లిదండ్రులు మళ్లీ ప్రైవేట్ స్కూల్ కి పంపించడం జరుగుతుంది మెదక్ జిల్లాలోని యూకేజీ ఇన్‌స్టార్టర్ ఆయా అనే ప్రోగ్రాంకి జిల్లాలో 99 స్కూళ్లను సెలెక్ట్ చేయడం జరిగింది. అన్ని స్కూళ్లలో ఇలాంటి పరిస్థితి ఉన్నందునఉపాధ్యాయులకు సంబంధించిన యూనియన్స్ ఈ సమస్య పైన దృష్టి సారించాలని కోరుకుంటున్నాం మాకు ఉన్న సమాచారం ప్రకారం అన్ని మండలాల్లోని స్కూల్స్ టీచర్స్ ఆయాలను అలాట్మెంట్ చేసి ఎంఈఓలు డిఇఓ గారికి ఇచ్చామని చెప్తున్నారు.

జిల్లాలోని కొంతమంది అధికార పార్టీకి చెందిన నాయకులు గ్రామాలలో అప్లై చేసుకున్న టీచర్స్ అలాగే ఆయా సెలెక్ట్ అయిన ఈ బడా నాయకులు మా వర్గానికి చెందిన వాళ్లనే సెలెక్ట్ చేయాలని ఆఫీసర్స్‌కి ప్రెషర్ చేయడం వల్ల ఇప్పటికీ ఈ సమస్య అలాగే ఉన్నదని భావిస్తున్నాం ఈ సమస్యపైన జిల్లా కలెక్టర్ తొందరగా నిర్ణయం తీసుకొని మా విద్యార్థులందరికీ మంచి విద్యని అందించాలని కోరుకుంటున్నట్లు విజ్ఞప్తి చేశారు.

## హత్యకేసులో నిందితుడికి జీవితకాల కఠిన కారాగార శిక్ష

**సిద్దిపేట, జులై 24(జనంసాక్షి):** సిద్దిపేట్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్య కేసులోని నిందితుడు బండి రమేష్(35) అనే వ్యక్తికి న్యాయస్ధానం జీవిత ఖైదీ జైలు శిక్షతో పాటు 10,000 జరిమానా విధిస్తూ న్యాయస్థానం న్యాయమూర్తి వై. జయప్రసాద్ తీర్పు వెల్లడించారు.వివరాల్లోకి వెళితే సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్లో 12/03/2024న కేసు నమోదు చేయడమైనది. ఈ కేసులో దర్యాప్తు అధికారి అప్పటి ఇన్స్పెక్టర్ ఎం.శ్రీను, అప్పటి ఎస్ఐ జి.అపూర్వ రెడ్డి సమగ్ర దర్యాప్తు నిర్వహించి, పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి పటిష్టమైన ఛార్జిషీట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేయడమైనది. విచారణ సందర్భంగా ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదుల ఆత్మరాములు వాదనలు వినిపించగా, ప్రస్తుత ఇన్స్పెక్టర్ విద్యాసాగర్, ఎస్ఐ డి.నవత, సాక్షాలు నమోదు చేసిన ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, లైజనింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, సీడీఓ రవి సమన్వయంతో కేసు విచారణలో సహకారం అందించారని పేర్కొన్నారు.సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలు మరియు ఇతర ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం న్యాయమూర్తి వై. జయ ప్రసాద్ నిందితుడిని దోషిగా నిర్ధారించి జీవితకాల కఠిన కారాగార శిక్షతో పాటు 10,000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన అధికారులను, సిబ్బందిని సిద్దిపేట సిపి రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ అభినందించారు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం...అపూర్వ స్పందన




**వనపర్తి బ్యూరో, జులై 24 (జనంసాక్షి):** ఢిల్లీలో సీజెపి యువజన విద్యార్థులపై పోలీసుల లాఠీ చార్జ్, బిజెపి విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష ప్రజాస్వామ్య విద్యార్థి సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపు వనపర్తి జిల్లాలు విజయవంతమైందని నేతలు తెలిపారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడి ఎస్యు ఎన్ఎస్‌యుఐ గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కళాశాలలు పాఠశాలలకు వెళ్లి బందు పాటించాల్సిందిగా విద్యార్థులను కోరామన్నారు. బిజెపి విద్యార్థి యువజన వ్యతిరేక విధానాలను, సీజేపీపై దాడిని వివరించామన్నారు. విద్యార్థులు అపూర్వంగా స్పందించారని కళాశాలలు పాఠశాలలు వదిలి ఆందోళనలో పాల్గొన్నారు అన్నారు. బిజెపి పోలీస్ విధానాలను తీవ్రంగా నిరసించారన్నారు భవిష్యత్తు పోరాటానికి మద్దతు పలికారన్నారు. 12 ఏళ్లలో 136 సార్లు పేపర్ల లీక్కు బాధ్యుడైన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నీటు రద్దుతో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు కోటి పరిహారం చెల్లించాలని, ఎన్ టి ఏ ను రద్దు చేయాలని రద్దు చేయాన్న డిమాండ్లను విద్యార్థులు స్వాగతించారన్నారు. విద్యావ్యవస్థను ప్రక్షాళనం చేయాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మల్లేష్, పి డి ఎస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి గణేష్ ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివ తదితరులు పాల్గొన్నారు.

## వరికి బదులు స్వల్పకాలిక పంటలు వేసుకోవాలి



**మల్దకల్, జులై 24 (జనంసాక్షి):** ఎల్‌నినో వలన వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మల్దకల్ మండలంలోని మద్దెల బండ,పెద్దతాండ,నాగర్ దొడ్డి, నీలిపల్లి, కుర్తి రావులచెరువు, పెద్దపల్లి, ఉలిగేపల్లి, అమరవాయి గ్రామాలలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామాలలో రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే రాజశేఖర్ మాట్లాడుతూ ఎల్‌నినో వలన రెండు నెలల వరకు వర్షాలు పడక పోవచ్చు అని బోర్లలో నీటి మట్టం తగ్గే అవకాశం ఉన్నందున స్వల్ప కాలిక పంటలను వేసుకోవాలని సూచించారు. రైతులు వరికి ప్రత్యామ్నాయంగా జొన్న, వేరుశనగ, రాగి, కొర్ర, మొక్కజొన్న మిశ్రమ పంటలు,ఆయిల్ పామ్ వంటి పంటలను సాగుచేయాలని సూచించారు. బిందు సేద్యం తుంపర సేద్యం వలన ఉపయోగించాలని చెప్పడం జరిగింది.నీటి కుంటల నిర్మాణం, ఇంకుడు గుంతల ఏర్పాటు భూమి ఉన్న ప్రతి ఒక్క రైతు భూ ఆధార్‌కార్డ్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రైతులకు సూచించారు. సర్పంచ్ తిమ్మప్ప మాట్లాడుతూ వరికి బదులుగా స్వల్ప కాలిక పంటలను వేసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ప్రసన్న, పంచాయతీ సెక్రెటరీ లక్ష్మణ్ నాయక్,జిపిఓ శివశంకర్, మద్దెలబండ పెద్దతండా సర్పంచు నార్య నాయాక్,ఉపసర్పంచులు ఎంబి కృష్ణయ్య, భీక్యానాయక్, రైతులు పాల్గొన్నారు.

## మంత్రి హోదా విప్ యన్నం శ్రీనివాస్ రెడ్డికి సన్మానం



**వెల్దండ జులై,24 (జనంసాక్షి):** మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యన్నం శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర మంత్రి హోదా రాష్ట్ర ప్రాధాన్యత ప్రోటోకాల్‌గా నియమితులైన సందర్భంగా హైదరాబాదులోని అసెంబ్లీ హాలులోని సీఎల్పీ కార్యాలయంలో వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ నాగర్ కర్నూల్ జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు యెన్నం భూపతిరెడ్డి ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ రిటైర్డ్ ఉపాధ్యాయులు యన్నం కృష్ణారెడ్డి శుక్రవారం శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెల్దండ మండల కేంద్రానికి చెందిన యన్నం శ్రీనివాసరెడ్డి మహబూబ్నగర్ ఎమ్మెల్యేగా రెండవసారి గెలిచి రాష్ట్ర మంత్రి హోదాగా నియమితులైనందుకు మన ప్రాంతానికి గర్వ కారణం అని అన్నారు.

## భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలి



**వెల్దండ, జూలై 24 (జనంసాక్షి):** భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, భూగర్భ జలాల పెంచడం సామాజిక బాధ్యత అని వెల్దండ ఎంపీడీవో సులోచన అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బొల్లంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంకుడు గుంత, పోచమ్మ గడ్డ తండాలో బోర్వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్, చెదురుపల్లి గ్రామంలో వ్యవసాయ క్షేత్రంలో నీటి కుంటల నిర్మాణాలకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో ప్రస్తుత పరిస్థితుల్లో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి పథకంలో భాగంగా ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు తమ పంట క్షేత్రాలు బోరుబావుల వద్ద ఇంకుడు గుంతలను నిర్మించుకొని భూగర్భ జలాల పెంపునకు నడుం బిగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఈశ్వర్ జి, ఎంపీఓ, సర్పంచులు సత్తూరి ప్రసాద్ గౌడ్, మహిపాల్ నాయక్, ధన్సింగ్ నాయక్, ఉప సర్పంచులు రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, టెక్నికల్ అసిస్టెంట్ సత్యనారాయణ, క్షేత్ర సహాయకులు వెంకటేష్, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం



**మద్దూరు, జూలై 24 (జనంసాక్షి):** మద్దూర్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో మద్దూర్ మున్సిపల్ చైర్ పర్సన్ ఢిల్లీకర్ సరస్వతి జనార్ధన్, మున్సిపల్ కమిషనర్ సి. శ్రీకాంత్, 1వ వార్డు కౌన్సిలర్ సంగీత, పీ ఏ సి ఎస్ చైర్మన్ గూళ్ల నర్సిములు, టౌన్ అధ్యక్షులు జీడీ వెంకట్రాములు, పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు శాశ్వత గృహాలను అందించాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తోందని తెలిపారు.

మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, లబ్ధిదారులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డిఎంహెచ్ఓ డాక్టర్. జె సంధ్య కిరణమై

**మల్దకల్, జులై 24(జనంసాక్షి):** మండల కేంద్రంలోని పీహెచ్ సి కేంద్రాన్ని శుక్రవారం డిఎంహెచ్ఓ సంధ్య కిరణమై తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూసీజనల్ వ్యాధుల ఫీవర్ కేసులు, డయేరియా కేసుల రికార్డు పరిశీలన,ప్రతి గ్రామంలో ప్రతిరోజు ఫీవర్ సర్వే చేయాలి,ప్రతి మంగళవారం నుండి శుక్రవారం వరకు డ్రైడే కార్యక్రమం నిర్వహించాలి. గ్రామంలో పారిశుధ్య సిబ్బంది సమన్వయంతో నీటి నిల్వ ఉన్న గుంతలలో ఆయిల్ బాల్స్,వేసి దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలని, వైద్యాధికారులు డాక్టర్ ఉషారాణి, డాక్టర్ జయమ్మలతో సమీక్ష సమావేశం పలు సూచనలు అందించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షేత్ర స్థాయిలో సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ప్రసూతి సేవలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, లేదా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో జరగాలని గర్భం దాల్చిన రోజునుండి డెలివరీ వరకు వారికి అన్ని సేవలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు డాక్టర్ ప్రసన్నారాణి, డిపిహెచ్ ఎన్ వరలక్ష్మి,డాక్టర్ ఉషారాణి, డాక్టర్ జయమ్మ, స్టాఫ్ నర్స్ మమత, సూపర్వైజర్, శ్రీధర్, దేవన్న, ల్యాబ్ టెక్నీషియన్ రామస్వామి సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో కాలిపోయిన గుడిసె



**మల్దకల్, జూలై 24 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం దాసరపల్లి గ్రామంలో విద్యుత్ షాక్‌తో గుడిసె పూర్తిగా కాలిపోయింది.పూజారి రంగస్వామి గుడిసెలో 40 బస్తాల ఫర్టిలైజర్ మందులు, 10 బియ్యం బస్తాలు, ఇతర సామాగ్రి దుస్తులుతోపాటు వివిధ పరికరాలుఉండడంవల్ల పూర్తిగా కాలిపోయి దాదాపు మూడు లక్షల రూపాయలు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ వెంకటేష్,జిపిఓ రంగన్న,మాజీ సర్పంచ్ భరత్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డిసంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రభుత్వపరంగా బాధితుడు కుటుంబానికి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ప్రత్యామ్నాయ పంట ప్రణాళికపై గ్రామసభలు

**కేటీదొడ్డి, జూలై 24(జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నందున, రైతులు నష్టపోకుండా ముందస్తు ప్రణాళికతో అడుగులు వేయాలని మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్ రెడ్డి తెలిపారు. మండలం లోని సోంపురం, కుచినెర్ల, నందిన్నె, రంగాపురం, ఉమిత్యాల తండా, పాతపాలెం, పగుంట గ్రామాల్లో ఎల్‌నినో ప్రభావం మరియు ప్రత్యామ్నాయ (కంటింజెన్సీ) పంట ప్రణాళికపై శుక్రవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... ఎల్‌నినో వల్ల ఏర్పడే తీవ్ర వాతావరణ మార్పులు, పంటలపై వాటి ప్రతికూల ప్రభావాలను వివరించారు. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల సాగు, అందుబాటులో ఉన్న నీటిని బిందు, స్ప్రింక్లర్ పద్ధతుల్లో పొదుపుగా వాడుకోవడం, వర్షపు నీటి సంరక్షణ, ఫార్మ్ పాండ్స్ (వ్యవసాయ కుంటలు) మరియు సోక్ పిట్స్ (ఇంకుడు గుంతలు) ఏర్పాటుపై రైతులకు పూర్తి అవగాహన కల్పించారు. అలాగే భూసారాన్ని కాపాడుకునే పద్ధతులను వివరించారు.



నీటి సంరక్షణ చర్యలకు ప్రాధాన్యత ఇస్తూ, వ్యవసాయ శాఖ రూపొందించిన కంటింజెన్సీ ప్రణాళికను అమలు చేయడం ద్వారా పంట నష్టాలను నివారించవచ్చని స్పష్టం చేశారు.

ఈ గ్రామసభల్లో ఎంపీడీఓ, రమణ రావు ఎంపీఓ, రామన్ గౌడ్ పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు), ఆయా గ్రామాల సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## శ్రీ బంగారు మైసమ్మ తల్లికి వైభవంగా పూజలు



**జడ్చర్ల, జూలై 24 (జనంసాక్షి):** జడ్చర్ల పరిధిలోని కావేరమ్మపేట శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న ఈ ఆలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అలంకరణలు చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త గోనెల నరేందర్ మహేశ్వరి దంపతులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని స్థానిక భక్తులు, మహిళలు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## నూతన అదనపు కలెక్టర్‌ను సన్మానించిన జిల్లా టీఎన్జీవో నాయకులు



**నాగర్‌కర్నూల్, జూలై 24 (జనంసాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లాకు నూతనంగా వచ్చిన అదనపు కలెక్టర్ చెన్నయ్యని నాగర్‌కర్నూల్ జిల్లా టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు బావాండ్ల వెంకటేష్ కార్యదర్శి షర్ఫుద్దీన్ కార్యాలయంలో శాలువలతోఘనంగా సన్మానించారు. జిల్లా ప్రజలకు పెరుగైన సేవలు అందించుటలో ఉద్యోగులు తోడ్పాటు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో యూనియన్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు బావండ్ల వెంకటేష్, కార్యదర్శి షర్ఫుద్దీన్, ఉపాధ్యక్షులు చెన్నకేశవులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, నాగర్‌కర్నూల్ యూనిట్ అధ్యక్షులు నసిరుద్దీన్, కార్యదర్శి సురేష్ కుమార్, మహిళా నాయకులు అలివేలు, అరుణ, రామకృష్ణ, సుదర్శన్, బుగ్గప్ప, నాగయ్య, రాకేష్ కన్నా తదితరులు పాల్గొన్నారు.

## చెట్లు పెంచండి.. భూతాపాన్ని తగ్గించండి



**అయిజ, జులై 24 (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావం గురించి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు అయిజ మున్సిపాలిటీ కౌన్సిలర్ మద్దిలేటి, రైతు సోదరులకు ఎల్‌నీనో గురించి వివరించారు. భూమి వేడెక్కడం తో ప్రతికూల వాతావరణంలో ఈ ప్రభావం ఏర్పడుతుందని తెలిపారు. ముఖ్యంగా గత 30 సంవత్సరాలుగా చెట్ల పెంపకం గణనీయంగా తగ్గిపోయిందని, చెట్లు నరకడం విపరీతంగా పెరిగి పోయిందని ఆందోళన వ్యక్తపరిచారు. భూమికి ఆకాశానికి మధ్యన భూతాపం పెరగకుండా, ఒక పొర ఏర్పాటు ఉంటుందని, దానిని ఓజోన్ పొరగా పిలవబడుతుందని శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు తెలుపుతూ ఉంటారు. ఈ ఓజోన్ పొర దెబ్బ తినడం వల్ల, ఎల్‌నీనో ప్రభావం తీవ్రం అయిందని, దానివల్ల వర్షాలు సరిగ్గా కురవక పాడిపంటలు పై తీవ్ర ప్రభావం ఏర్పడుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతి విద్యార్థి, ఈ విషయాల గురించి అవగాహనా కలిగి ఉండాలని ఈ సందర్భంగా మద్దిలేటి తెలిపారు. ప్రతిఒక్కరూ చెట్లు నాటడం మాత్రమే కాదు, వాటి పెరుగుదలకు కూడా తోడ్పడాలి. చెట్లు పెంచి పెరుగుదలకు తోడ్పడినప్పుడే ఈ వాతావరణ పరిస్థితులను అధిగమించగలుగుతాం. రైతులు ప్రతి ఒక్కరూ సుఖంగా జీవించగలుగుతారు. అందుకే ప్రతి ఒక్కరూ చెట్లను నాటండి, చెట్లు పెరగడానికి అందరూ తోడ్పాటు అందించాలని ఆయన తెలిపారు.

## పేటలో 6 గంటల విద్యుత్ అంతరాయం



**నారాయణపేట, జులై 24(జనంసాక్షి):** నారాయణపేట పట్టణం 33/11కె.వి. ఉప విద్యుత్ కేంద్రంలో మరమ్మత్తు పనుల కారణంగా ఆదివారం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ మహేష్ గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు.పట్టణంలో ని యాదగిరి రోడ్డు ఫీడర్, చిల్డ్రన్ ఆసుపత్రి ఫీడర్, సివిల్ -1, సివిల్ -2, సత్యసాయి ఫీడర్ ,వీ.ఐ.పి. ఫీడర్ లకు విద్యుత్ అంతరాయం ఉంటుందని గృహ వినియోగదారులు, వ్యాపారస్తులు ఈ అంతరాయానికి సహకరించాలని ఏఈ కోరారు.

## పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత

- మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్



**పెబ్బేరు, జూలై (జనంసాక్షి):** పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత అని సీజనల్ వ్యాధులను సమర్ధవంతంగా అరికట్టవచ్చని పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస గౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 5వ వార్డులో నిర్వహించిన 'ఫ్రైడే-డ్రైడే' కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తో పాటు వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, స్థానిక కౌన్సిలర్ భాగ్యలక్ష్మి శివ పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజా ఆరోగ్యాన్ని కాపాడేందుకు మున్సిపాలిటీ తరపున పారిశుధ్య పనులను వేగవంతం చేస్తున్నామని, ప్రజలు కూడా అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు డాక్టర్ సుధారాణి, వార్డు ఆఫీసర్ ప్రీతి, ఆశవర్కర్లు మున్సిపల్ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



**మద్దూరు, జూలై 24 (జనంసాక్షి):** శుక్రవారం రోజు మద్దూర్ మున్సిపాలిటీ పరిధిలోని రేణివట్ల గ్రామంలోని అన్ని వార్డులలో నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ నమోదు ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ సి. శ్రీకాంత్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇంటింటికీ నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించి, ప్రతి కుటుంబం వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. నమోదు ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా మరియు నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత మున్సిపల్ అధికారులు, వార్డు సిబ్బంది, సూపర్‌వైజర్లు మరియు ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లోకి కొనసాగుతున్న చేరికలు

- చిన్నగుంటపల్లి కాంగ్రెస్ కార్యకర్తలు బి.ఆర్.ఎస్‌లో చేరిక
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమక్షంలో కండువాలు కప్పి ఆహ్వానం



**వనపర్తి రూరల్, జూలై 24, (జనంసాక్షి):** వనపర్తి మండలం చిన్నగుంటపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమక్షంలో భారత రాష్ట్ర సమితి (బి.ఆర్.ఎస్) పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి నిరంజన్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పని చేయాలని పిలుపునిచ్చారు. పాత, కొత్త కార్యకర్తల సమన్వయంతో గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. బి.ఆర్.ఎస్ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై విశ్వాసంతో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పార్టీలో చేరడం సంతోషకరమని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో కందూరు శాంతయ్య, దండు లక్ష్మయ్య, కందూరి ఎల్లయ్య, చిన్న వెంకటస్వామి, దండు రాజు, పానుగంటి రాజు, గొర్ల సతీష్, పానుగంటి గోపాల్, గొర్ల రమేష్, పానుగంటి మహేష్, గొర్ల రాజు, చరణ్, ఆర్కటం ఆంజనేయులు, గున్న చంద్రారెడ్డి, పోతురాజు బాలయ్య, మధు, పానుగంటి రవి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, చిట్యాల రాము, పానుగంటి రాము, ధర్మశాస్త్రి, భగవంతు యాదవ్, మైకెల్, పుల్లయ్య, బాలయ్య, పి. రాము, రాజేశ్వర్ రెడ్డి, శంషుద్దీన్, విష్ణు, కొమ్ము రాము, స్వామి, జి. రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న బిజెపి

- రాష్ట్రంలో బిఆర్ఎస్, కేంద్రంలో బిజెపి పేపర్ లీకేజీలకు బ్రాండ్ అంబాసిడర్స్
- కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్




**మహబూబ్ నగర్ అర్బన్ జూలై 24(జనంసాక్షి):** దేశాన్ని 10 ఏళ్లుగా పాలిస్తున్న బిజెపి ప్రభుత్వం పాలనలో ఇప్పటికే 152 సార్లు పరీక్ష పేపర్లు లీక్ చేసి విద్యార్థుల జీవితంతో చెలగాటమడుతుందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్ ఆరోపించారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడినారు. దేశ రాజధాని ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర విద్యార్థులు పేపర్ లీకేజ్ కి బాధ్యత వహిస్తూ కేంద్రం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేరాలని విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని డిమాండ్ల తో 24 రోజులుగా శాంతియుతంగా పోరాటం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం చీమకుట్టినట్లు కూడా లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు రోజుల క్రితం చలో పార్లమెంటు లో పాల్గొన్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం అక్కడి పోలీసులు ప్రవర్తించిన విధానం భారత ప్రజాస్వామ్యం తలదించుకొని సభ్య సమాజం ముందు చీదరించుకునే విధంగా విద్యార్థులపై లాఠీ ఛార్జ్, భాష గోళాల ప్రయోగం, నీటి ఫిరంగులు, విచక్షణ రహితంగా దాడులు చేశారని వారు ఆరోపించారు. భావి భారత ప్రధాని కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గతం నుండి దేశవ్యాప్తంగా పేపర్ ఎలా లీకేజీ అవుతుంది ఎంతమంది విద్యార్థులు నష్టపోతున్న అంశాన్ని కళ్ళకు కట్టే విధంగా ప్రచారం చేశారని తెలిపారు. ఈ పేపర్ లీక్ వల్ల 22 మంది విద్యార్థులు చనిపోయిన కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న కేంద్ర ప్రభుత్వం మాట అట్లా ఉంచితే ప్రశ్నిస్తున్న వారందరూ దేశద్రోహులుగా అభివర్ణించడం బిజెపికి చెల్లుబాటు అయిందన్నారు. బయట జరుగుతున్న ఆందోళనలను పార్లమెంట్లో జరుగుతున్న చర్చకు సమాధానం చెప్పకుండా భారత ప్రధాని ఎందుకు మౌనం ఉనరో ,ఈ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్రంలో గత బిఆర్ఎస్ పాలనలో ఇంటర్మీడియట్ పేపర్ లీకేజీ 27 మంది విద్యార్థుల సాగు కారణమైన గ్లోబరీ సంస్థ టిఆర్ఎస్ పార్టీకి చెందింది కాదా అని వారు ప్రశ్నించారు. ఇక రాష్ట్రంలో అధికారంలోకి రాము అనే భయంతో ముసలి కన్నీరు కారుస్తూ కేంద్రంపై ఇష్టం లేని విధంగా ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. నిజంగా విద్యార్థుల పై మీకు విశ్వాసం ఉంటే జంతర్ మంతర్ దగ్గరికి ఎందుకు వెళ్లలేదని వారు ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుండి బిజెపి విధానాలపై రాజీలేని పోరాటాలు చేస్తుందని విద్యార్థుల పక్షాన నిజాయితీగా నిలబడి పార్లమెంటులో విద్యార్థులకు అండగా ఉంటూ పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఇక కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాక్షేత్రంలో తప్పించుకోలేరని గతంలోనే రైతు పోరాటంలో వెనుకడుగు వేసిన ఈ ప్రభుత్వం విద్యార్థుల పోరాటానికి దిగిరాక తప్పదని వారు హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మీడియా సెల్ కన్వీనర్ సి జే బెనహర్, పార్టీ సీనియర్ నాయకులు బెక్కరి మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హిందూపూర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ధర్నా



**కృష్ణ, జూలై 24 (జనంసాక్షి):** నీట్ పేపర్ లీక్ కు వ్యతిరేకంగా జంతర్ మంతర్‌లో విద్యార్థుల ధర్నా విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేయిస్తున్న బిజెపి ప్రభుత్వం పై రాహుల్ గాంధీ ప్రియాంక , గాంధీ గారు మోడీ ఇంటి ముందు ధర్నా చేస్తుండగా వారిని అక్రమంగా అరెస్ట్ చేసిన సందర్భంగా శుక్రవారం కృష్ణ మండల హిందూపూర్ గ్రామ గాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్‌పై పూర్తి స్థాయి, పారదర్శక దర్యాప్తు జరపాలని,దోషులను ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలనీ,విద్యార్థులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడిన వారిని కాపాడే ప్రయత్నాలు ఆపాలనీ, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన నాయకులు, కార్యకర్తలపై పెట్టిన చర్యలను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు మాలిపాటేల్ వీజయప్ప గౌడ్ , యువజన కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ సర్ఫరాజ్ , కున్సి పల్లే సురేష, మాజి ఎంపీపీ , గ్రామాల సర్పంచులు అలంపల్లి శంక్రప్ప , ఉప సర్పంచులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మైనారిటీ సెల్ నాయకులు, యువకులు , మండల కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సంజాపూర్‌లో సీసీ రోడ్ల పనుల పరిశీలించిన కౌన్సిలర్ జిల్లా అధికార ప్రతినిధి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన అభివృద్ధి పనులు



**కల్వకుర్తి, జూలై24 (జనంసాక్షి):** కల్వకుర్తిమండలంలోని సంజాపూర్ గ్రామ 9వ వార్డులో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను వార్డు కౌన్సిలర్ చిత్తరి ఎల్లమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి పనుల పురోగతిని పరిశీలించి, పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సంబంధిత వారికి సూచించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నామల ఆనంద్‌కుమార్, స్థానిక వార్డు కౌన్సిలర్ చిత్తరి ఎల్లమ్మలకు సంజాపూర్ గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తరి ఎల్లమ్మ (వార్డు కౌన్సిలర్), చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి (నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి), ఉడత బక్కయ్య, రామకృష్ణ, దీపు బక్కయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తొలి ఏకాదశి వేళ శ్రీరంగాపురం రంగనాయకుడికి 108 కలశాలతో ప్రత్యేక అభిషేకం

**శ్రీరంగాపూర్, జూలై 24 (జనంసాక్షి):** శ్రీరంగాపురం ఆషాఢ శుద్ధ ఏకాదశి – తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని దక్షిణ శ్రీరంగంగా పిలువబడే శ్రీరంగాపురం శ్రీ రంగనాయక స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. చాతుర్మాస్య వ్రతం ప్రారంభమయ్యే ఈ పవిత్ర రోజున స్వామివారికి పవిత్ర కృష్ణా నది జలాలతో 108 బంగారు కలశాలతో అభిషేకం చేశారు. మంగళ వాయిద్యాలు, మేళ తాళాల నడుమ, వేద మంత్రోచ్చారణలతో అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు.



ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ విష్ణు నారాయణ, కన్నయ్య తదితర అర్చక బృందం నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో ఏర్పాటు చేసిన 108 కలశాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలి ఏకాదశి రోజున స్వామిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగి, మోక్షం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ కోరిది.

## మనోపాడులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన



**మనోపాడు, జూలై 24 (జనంసాక్షి):**
టీపీసీసీ ఆదేశాల మేరకు, ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ సూచనలతో మనోపాడు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రలో అలంపూర్ తాలూకా యూవజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వరకుంట్ల గణేష్, మండల అధ్యక్షులు జగన్మోహన్ నాయుడు ,యూవజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాషాపోగు శేఖర్, పరమేష్ నాయుడు, శేఖర్, మద్దిలేటి, క్రాంతి కుమార్, నాగరాజు, బాషా, సర్పంచులు, హుస్సేన్, ప్రసాద్, రత్నకుమార్, బీమరాజ్ ,రాజాక్,వజ్ర,రాజేష్, మాజీ సర్పంచులు,ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై విద్యార్థి సంఘాల నిరసన

- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్
- ఉప్పునుంతల మండలంలో విద్యాసంస్థల బంద్



**ఉప్పునుంతల, జూలై 24 (జనంసాక్షి):** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులపై జరిగిన లాఠీచార్జీని నిరసిస్తూ శుక్రవారం ఉప్పునుంతల మండలంలోని ఉప్పునుంతల, కంసానిపల్లి, గట్టుకడిపల్లి విద్యాసంస్థల్లో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు చింతల నాగరాజు, డివైఎఫ్ఐ మండల నాయకుడు ఎస్.కె. పాషా మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రశ్నపత్రాల నిర్వహణలో వైఫల్యాలకు బాధ్యమైన జాతీయ పరీక్షల సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కారణంగా మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి రూ.2 కోట్ల నష్టపరిహారం అందించాలని, ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులపై లాఠీచార్జీ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అలాగే కేంద్ర ప్రభుత్వం యువతకు ఇచ్చిన ఉద్యోగ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు అఖిల్, రాజు, గణేష్తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## వర్షాభావానికి ముందస్తు అప్రమత్తత.. వరికి బదులు ఆరుతడి పంటలే మేలు

**గోపాల్‌పేట, జూలై 24 (జనంసాక్షి):** వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేయాలని అధికారులు సూచించారు. అదేవిధంగా పొలాల్లో ఫార్మ్‌పాండ్‌లు, ఊటకుంటలు, బోర్లకు రీచార్జ్ పిట్స్, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ పనులను ప్రభుత్వం VB-GRAM పథకం ద్వారా పూర్తి వ్యయంతో చేపడుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీఓ భవాని, ఏపీఓ నరేందర్, సర్పంచ్ లోకారెడ్డి, ఏఈఓ, ఉపసర్పంచ్ రామచంద్రయ్య, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు. నీటి సంరక్షణ చర్యల్లో ప్రతి రైతు భాగస్వామి కావాలని అధికారులు పిలుపునిచ్చారు.

## కేటీఆర్ జన్మదినోత్సవ సందర్భంగా చిన్నారి కుటుంబానికి ఆర్థిక సహాయం

**మధురు, జూలై 24 (జనంసాక్షి):**
కటీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మద్దూరు మున్సిపాలిటీలోని భీంపూర్ గ్రామంలోని శివ లీల అనే విద్యార్థినికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. ఇటీవలే చిన్నారి తండ్రి (రాచూరి లాలప్ప) అనారోగ్యంతో మృతి చెందారు, తల్లి కమలమ్మ వ్యవసాయ కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని వెల్లదీస్తున్న క్రమంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సేవా కార్యక్రమంలో భాగంగా చిన్నారి చదువు కోసం బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్, పార్టీ నాయకులు కలిసి ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం గ్రామంలో కేటీఆర్ 50వ జన్మదినోత్సవంను పురస్కరించుకొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకోవడం జరిగింది. ఇక్కడ నుండి మున్సిపాలిటీ పరిధిలోని నాగంపల్లి గ్రామంలో కేటీఆర్ జన్మదిన వేడుకలను గ్రామ బి ఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో మున్సిపాలిటీ నాయకులు కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దినేష్, నరసింహ, మౌలానా, లింగ్య నాయక్, గోపాల్, సంగీత శివకుమార్, బిఆర్ఎస్ నాయకులు చికిని అంజయ్య, మహేందర్, సాయిలు, నరసింహ, భాస్కర్, కొంతం విటల్ తదితరులు పాల్గొన్నారు.

## పేటలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**నారాయణపేట, జూలై 24(జనంసాక్షి):** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 50 వ జన్మదిన వేడుకలను శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు విజయ్‌సాగర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. రాష్ట్ర ప్రజల సేవలో తరించేందుకు కేటీఆర్‌కు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ల కాకర్ల నారాయణమ్మ, భరత్, పార్టీ నాయకులు సుదర్శన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, చెన్నారెడ్డి, జగదీష్, ప్రకాష్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గద్వాల్ అయిజ మీదుగా రాయచూర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలి



**అయిజ, జులై 24 (జనంసాక్షి):** గద్వాల్ జిల్లా కేంద్రం నుండి ఐజ మీదుగా కర్నూల్ – రాయచూర్‌కు ప్రత్యక్ష బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గురువారం గద్వాల్ డిపో మేనేజర్‌కి వినతి పత్రం అందజేశామని నడిగడ్డ బహుజన సమితి జిల్లా నాయకులు తెలిపారు. జిల్లా అధ్యక్షులు బండారు ఎస్. రాజ్ మాట్లాడుతూ, గద్వాల్, ఐజ, బలిగేర ప్రాంతాల నుండి కర్నూల్, రాయచూర్ కు వెళ్లే విద్యార్థులు, రోగులు, వ్యాపారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రత్యక్ష బస్సు లేకపోవడంతో ప్రయాణికులు మధ్యలో బస్సులు మారాల్సి వస్తుందని, దీనివల్ల సమయం, డబ్బు వృధా అవుతుందని తెలిపారు. ఉదయం 7:00 గంటల నుండి బలిగేరా్ శీ ఐజకు బస్సు సౌకర్యం లేక స్కూల్‌కు, కాలేజీకి వెళ్లే విద్యార్థుల చాలా ఇబ్బంది పడుతున్నారు అని అన్నారు. కావున ప్రజా అవసరాల దృష్ట్యా వెంటనే గద్వాల్ – ఐజ మీదుగా కర్నూల్, రాయచూర్ కు ప్రత్యక్ష బస్సు సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బస్సు సౌకర్యం కల్పించని యెడల నడిగడ్డ బహుజన సమితి తరుపున బస్సు డిపో ముందు దర్న చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐజ మండలం అధ్యక్షులు పక్కిరప్ప, కొండపల్లి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు

- ఇందిరా పార్క్‌లో జరుగుతున్న దీక్షకు సంఘీభావంగా హైదరాబాద్‌కు యువకుల బయలుదేరు



**ఉప్పునుంతల, జూలై 24 (జనంసాక్షి):**
ఉప్పునుంతల మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్ రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద కేటీఆర్ నిర్వహిస్తున్న దీక్షకు సంఘీభావం ప్రకటిస్తూ ఉప్పునుంతల మండల కేంద్రం నుంచి యువకులు బయలుదేరారు. బయలుదేరిన వారిలో చిన్నా, జంగయ్య, తాండ్ర శేఖర్, బాలస్వామి, వెంకటేష్, సయ్యద్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన కార్యక్రమాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని వారు ఈ సందర్భంగా తెలిపారు.

## మన ఇల్లు - మన ఆరోగ్యం
## కార్యక్రమాన్ని అధికారులందరూ విధిగా పాటించాలి

- **జిల్లా కలెక్టర్ ప్రియాంక**



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 24(జనంసాక్షి):** మన ఇల్లు – మన ఆరోగ్యం” కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులందరూ తమ నివాసాల్లో దోమల వ్యాప్తికి అవకాశం లేకుండా పరిశుభ్రత చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ తన క్యాంపు కార్యా లయంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పూల కుండీలు, నీటి తొట్టిల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి, కార్యాలయ ఆవరణలో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల దోమల లార్వా అభివృద్ధి చెంది, దోమల సంఖ్య పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. దోమల ద్వారా డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం జిల్లా అధికారులందరూ తమతమ నివాసాల్లో “మన ఇల్లు –మన ఆరోగ్యం”కార్య క్రమాన్ని విధిగా నిర్వహించి, నీరు నిల్వ ఉండే ప్రదేశాలను పరిశుభ్రం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఈ కార్యక్రమాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి, ప్రతి కుటుంబం పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె పిలుపునిచ్చారు.

## ఫీజుల బకాయి..బిజెపి లడాయి..పోస్టర్ విడుదల



**నారాయణపేట జూలై 24(జనంసాక్షి):** రాష్ట్రశాఖ పిలుపు మేరకు నారాయణ పేట జిల్లా కేంద్రంలో శుక్రవారం బీజేవైఎంఆధ్వర్యంలో ఫీజుల బకాయి...బిజెపి లడాయి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్ మాట్లాడుతూ రాష్ట్రం లో 15,000 కోట్ల రూపాయలు ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్షిప్ లు పెండింగ్ లో ఉన్నాయని వెంటనే వాటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయి లు విడుదల చేసే వరకు రోజు వారిగా ఉద్యమిస్తా మని తెలిపారు. ఉద్య మంలో భాగంగా రేపటి నుండి కళాశాలకు వెళ్లి ప్రతి విద్యార్థిని కలిసి ప్రభుత్వా నికి వ్యతిరేకంగా సంత కాలు సేకరిస్తామని తెలిపా రు, అవసరమైతే ప్రభుత్వ కార్యాలయాలు,ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరిం చారు ఈ కార్యక్రమంలో. పట్టణ అధ్యక్షుడు జాజా పూర్ మణిశంకర్,జిల్లా ఉపాధ్యక్షులు కే. శ్రీనివా స్,మోహన్, కోశాధికారి మణి,చేతన్,డి. మణి, నవీన్ చామకూర,గోకుల్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినోను తట్టుకునే పంటలు వేసుకోవాలి

- **డివిజన్ ఉద్యాన శాఖ అధికారి మహేశ్వరి**




**ఉర్కొండ, జూలై 24, (జనంసాక్షి);** ఎల్‌నినోను తట్టుకునే పంటలు సాగు చేసుకోవాలని డివిజన్ ఉద్యాన శాఖ అధికారి మహేశ్వరి తెలియజేశారు. ఊరుకొండ మండలంలోని రేవల్లి గ్రామపంచాయతీలో శుక్రవారం రోజు జరిగిన రైతుల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ ఎల్‌నీనొ ప్రభావం కారణంగా తక్కువ వర్షపాతం భూగర్భ జలాల కొరత ఏర్పడే అవకాశం ఉంది. కాబట్టి ఉద్యాన పంటలు తీవ్రంగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. కావున వరికి ప్రత్యామ్నాయంగా బోరులు బావుల కింద పండ్లతోటలు, కూరగాయలు, మునగ ,పూలు, మల్బరి ,పలు రకాల ఉద్యాన పంటల సాగు చేసుకోవాలి. అంతేకాకుండా ఉద్యాన శాఖ నుండి ప్లాస్టిక్ మల్చింగ్, బిందు సేద్యం ,నీటి కుంటలు, కూరగాయల పందిళ్ళపై ,పలు రాయితులు అందిస్తున్నాము. ఆలస్యంగా వర్షాలు వచ్చినట్లయితే తక్కువ కాల వ్యవధిగల మరియు కరువును తట్టుకునే పంట రకాలైన ఎంపిక చేసుకోవాలని సూచిస్తున్నాము. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉద్యానశాఖ అధికారి మ,హేశ్వరి, ఏఈఓ సాహితి ,ఉద్యాన విస్తారనాధికారి శివలీల ,గ్రామ సర్పంచ్ బంగారయ్య,గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది.

# ప్రజల చేత శభాష్ అనిపించుకున్న వనపర్తి పోలీస్

- **రూ.65 లక్షల విలువైన 236 మొబైళ్ల రికవరీ**
- **సీఈఐఆర్ సాయంతో బాధితులకు తిరిగి అందజేసిన వనపర్తి పోలీసులు**
- **ఆరు రాష్ట్రాల నుంచి మొబైళ్ల గుర్తింపు**
- **ఎస్పీ సునిత రెడ్డి చేతుల మీదుగా పంపిణీ**
- **రికవరీ బృందానికి నగదు బహుమతులతో ప్రశంసలు**



**వనపర్తి, బ్యూరో జూలై 24 (జనంసాక్షి):** పోయిన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లు తిరిగి దొరకవని భావించిన బాధితులకు వనపర్తి జిల్లా పోలీసులు చిరునవ్వులు పంచారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) వ్యవస్థను సమర్థంగా వినియోగించి సుమారు రూ.65 లక్షల విలువైన 236 మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ‘మొబైల్ ఫోన్ రికవరీ మేళా’లో జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, బాధితులకు మొబైల్ ఫోన్లను అందజేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల కష్టార్జిత ఆస్తిని తిరిగి వారికి చేర్చడం పోలీసుల బాధ్యత మాత్రమే కాకుండా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే కర్తవ్యమని అన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోయిన, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను వేగంగా గుర్తించి తిరిగి బాధితులకు అందిస్తున్నామని తెలిపారు. మొబైల్ పోయిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని, ఇందుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

ప్రత్యేక రికవరీ బృందాలను ఏర్పాటు చేసి నెల రోజుల వ్యవధిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాల నుంచి ఈ మొబైల్ ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. రికవరీ చేసిన వాటిలో తెలంగాణ నుంచి 196, ఆంధ్రప్రదేశ్ నుంచి 15, మహారాష్ట్ర నుంచి 9, కర్ణాటక నుంచి 8, మధ్యప్రదేశ్ నుంచి 6, కేరళ నుంచి 2 మొబైల్ ఫోన్లు ఉన్నాయని వివరించారు.

జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు మొత్తం 500 మొబైల్ ఫోన్లను బాధితులకు తిరిగి అందజేసినట్లు ఎస్పీ తెలిపారు. మొబైల్ ఫోన్లలో వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపులు, సోషల్ మీడియా ఖాతాలకు సంబంధించిన కీలక సమాచారం ఉంటుందని, ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ ద్వారా బ్లాక్ చేయించుకోవాలని సూచించారు. అలాగే సెకండ్ హ్యాండ్ మొబైల్ కొనుగోలు చేసే వారు తప్పనిసరిగా విక్రేత నుంచి రసీదు తీసుకోవాలని, దొంగిలించిన మొబైళ్ల కొనుగోలు చేసినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మొబైల్ ఫోన్లు తిరిగి అందుకోవడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తూ జిల్లా పోలీసులకు, ముఖ్యంగా రికవరీ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ మొబైళ్లు తిరిగి లభిస్తాయని ఊహించలేదని, పోలీసుల కృషి వల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు.

మొబైల్ ఫోన్ల రికవరీలో విశేష ప్రతిభ కనబరిచిన సీసీఎస్ సీఐ పవార్ అశోక్ కుమార్, ఎస్సై రామరాజు, ఏఎస్సై తిరుపతి రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఎస్పీ నగదు బహుమతులతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీ నాయక్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, వనపర్తి, కొత్తకోట, ఆత్మకూరు సీఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏబీవీపీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ శవయాత్ర, దిష్టిబొమ్మ దగ్ధం



**నారాయణపేట జూలై 24(జనంసాక్షి):** విద్యార్థుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనీ నిరసిస్తూ శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నారాయణపేట శాఖ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి శవయాత్ర నిర్వహించి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎబివిపి జిల్లా కన్వీనర్ నరేష్ మాట్లాడు తూ పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ ,స్కాలర్షిప్ జాబ్ కేలండర్ ని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న రూ11,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో జరుగుతున్న జాప్యం వల్ల ప్రతి సంవత్సరం సుమారు రెండు లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిరోజు దిల్సుఖ్ నగర్, అశోక్ నగర్ లో నిరుద్యోగులు వేలాది సంఖ్యలో ధర్నాలు చేస్తా ఉంటే రేవంత్ రెడ్డి మొద్దు నిద్ర పోతావున్నా డనీ విమర్శించారు. ఈ పరిస్థితికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నారాయణపేట జిల్లా విద్యాసంస్థలో మౌలిక వసతుల కొరత, ఖాళీ అధ్యాపక పోస్టులను భర్తీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించి, విద్యార్థుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలని కోరారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి సతీష్, చరణ్ రెడ్డి, కళాశాల అధ్యక్షులు రోహిత్, తరుణ్ రవి,మేఘన, అక్షర కళాశాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలన్నీ పొందాలంటే రైతు రిజిస్ట్రేషన్ కీలకం

- **మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ నాయక్**



**ఉప్పునుంతల, (జనంసాక్షి):** ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న అన్ని పథకాల ప్రయోజనాలు పొందాలంటే రైతు రిజిస్ట్రేషన్ (Farmer Registration ID) తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు రిజిస్ట్రేషన్ విషయంలో నిర్లక్ష్యం చేయకుండా స్పందించి, వారం రోజులలోపు తప్పనిసరిగా రైతు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. రైతు రిజిస్ట్రేషన్ ఉంటేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, రైతు భరోసా, రైతు బీమా తదితర పథకాల ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

మండలంలో మొత్తం 18,728 మంది రైతులు ఉండగా, ఇప్పటివరకు 13,573 మంది మాత్రమే రైతు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. ఇంకా 5,155 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోలేదని, ప్రస్తుతం మండలంలో 73 శాతం మాత్రమే నమోదు పూర్తైందన్నారు.

అందువల్ల 100 శాతం రైతు రిజిస్ట్రేషన్ లక్ష్యంగా ప్రతి రైతు వెంటనే నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. రైతు రిజిస్ట్రేషన్ ద్వారా యూరియా, ఎరువుల పంపిణీ, రైతు భరోసా, రైతు బీమా, ఇతర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందుతాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ లేని రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందకపోయే అవకాశం ఉందని హెచ్చరించారు.

అందువల్ల రైతులందరూ తమకు సమీపంలోని వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) లేదా సంబంధిత కేంద్రాలను సంప్రదించి వెంటనే రైతు రిజిస్ట్రేషన్ ఐడీ పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రంగనాయకస్వామి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



**శ్రీరంగాపూర్, జూలై 24 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ టూరిజం మరియు యువజన శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్ గారిని వనపర్తి జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ, వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలంలోని ప్రసిద్ధ శ్రీశ్రీశ్రీ రంగనాయక స్వామి దేవాలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని వినతిపత్రం అందజేశారు. ఆలయానికి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని, పర్యాటకంగా అభివృద్ధి చేస్తే భక్తులకు, స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ఆలయాన్ని స్వయంగా సందర్శించాలని కూడా ఆయన కోరారు. దీనిపై స్పందించిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి తప్పకుండా ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవీందర్, తోఫిక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగాపురం ఆలయ చిత్రపటాన్ని రాజేంద్ర ప్రసాద్ యాదవ్ వాణి ప్రసాద్ గారికి అందజేస్తున్న దృశ్యం.

## బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత 125 రోజుల కోర్స్

- **జూలై 25 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ**



**గద్వాల నడిగడ్డ, జూలై 23(జనంసాక్షి);** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాల సాధన లక్ష్యంగా 125 రోజుల ఉచిత ఫౌండే షన్ కోర్స్ నిర్వహిస్తున్నట్లు టీజీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని ఆయన పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాలకు చెందిన అభ్యర్థులు www.tgbc studycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవా లని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ జూలై 25,2026 నుంచి ప్రారంభమై ఆగస్టు 14,2026 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆగస్టు 18న విడుదల చేయనున్నట్లు, ఆగస్టు 20 నుంచి 24 వరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించి, ఆగస్టు 25 నుంచి కోచింగ్ ప్రారంభం కానుందని వివరించారు. అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వ విద్యాలయం నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, గ్రామీణ ప్రాంత అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షల లోపు,పట్టణ ప్రాంత అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.00 లక్షల లోపు ఉండాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం 40 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. గతంలో బీసీ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ పొందిన అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు కాదని స్పష్టం చేశారు. ఈ ఫౌండేషన్ కోర్స్‌లో గ్రూప్–I,గ్రూప్–II,గ్రూప్–III,గ్రూప్–IV, బ్యాంకింగ్, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, రైల్వే రికూట్‌మెంట్ బోర్డ్, పోలీస్ రిక్రూట్‌మెంట్ తదితర రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలకు సమగ్ర శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధనతో పాటు వీక్లీ టెస్టులు, గ్రాండ్ టెస్టులు నిర్వహించబడతాయని, లైబ్రరీ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుందని చెప్పారు. కోచింగ్ కాలంలో అభ్యర్థులకు ప్రతినెల రూ.1,000 చొప్పున బుక్ ఫండ్, రవాణా భత్యంగా స్టైపెండ్ అందజేయనున్నట్లు తెలిపారు. మొత్తం సీట్లలో 75 శాతం బీసీ అభ్యర్థులకు, 25 శాతం ఇతర వర్గాల అభ్యర్థులకు కేటాయించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు ఇది మంచి అవకాశమని,అర్హులైన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 08546-293022, 9985434941 ఫోన్ నంబర్లుకు సంప్రదించాలన్నారు.

## కేటీదొడ్డిలో నూతన శాశ్వత ఆధార్ సెంటర్ ప్రారంభం



**కేటీదొడ్డి, జులై 24(జనంసాక్షి):** గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలు, ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఆధార్ నమోదు కేంద్రాలను అందుబాటులోకి తెస్తోందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గారి సతీమణి బండ్ల జ్యోతి తెలిపారు. శుక్రవారం కె.టి.దొడ్డి మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన శాశ్వత ఆధార్ సెంటర్‌ను ఆమె ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రం నిర్వాహకులు మరియు స్థానిక నాయకులు, మహిళలు బండ్ల జ్యోతిని శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆమె ఆధార్ కేంద్రంలో మొదటి నమోదు ప్రక్రియను ప్రారంభించి, లబ్ధిదారునికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. అనంతరం బండ్ల జ్యోతి గారు మాట్లాడుతూ... మండల పరిధిలోని గ్రామీణ ప్రజలు ఆధార్ సేవల కోసం దూరప్రాంతాలకు వెళ్లి తీవ్ర ఇబ్బందులు పడేవారని, ఈ నూతన కేంద్రంతో ఆ తిప్పలు తప్పనున్నాయని పేర్కొన్నారు. ఇకపై ఈ కేంద్రంలో కొత్త ఆధార్ నమోదుతో పాటు వివరాల సవరణ, నవీకరణ (అప్‌డేట్), ఫోటో మార్పులు మొబైల్ నంబర్ లింకింగ్ వంటి సేవలను సులభంగా పొందవచ్చని తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గద్వాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుర్వ హన్మంతు, బిఆర్ఎస్ మండలాధ్యక్షులు ఉరుకుందు, గ్రామ సర్పంచ్ నారాయణ, మీసేవా సెంటర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సురేష్, వెంకటేష్ నాయుడు ఆలయ కమిటీ మాజీ డైరెక్టర్లు రాధారెడ్డి, మధుమతి, ఆధార్ సెంటర్ నిర్వాహకులు రవిబాబు, నాయకులు యుగేందర్ గౌడ్, వెంకన్న గౌడ్, నాసిర్, వెంకటాపురం గోపి, మల్లేష్ గౌడ్, కొండన్న, రంగారెడ్డి, వీరేష్, మహాదేవ్, ఇతర నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వీరనాగమ్మ అమ్మవారి వేడుకల్లో ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



**నాగర్‌కర్నూల్, జూలై 24 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ పట్టణం 16వ వార్డులో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీ వీరనాగమ్మ అమ్మవారి పండుగ వేడుకల్లో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్, 16వ వార్డు కౌన్సిలర్ సింధు, ఎస్సీ సెల్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ నిరంజన్, కౌన్సిలర్లు శంకర్, ఖాజాఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**జహీరాబాద్, జులై 24(జనంసాక్షి):** భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కల్వకుంట్ల తారకరామారావు 50వ జన్మదిన వేడుకలను జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధికి కేటీఆర్ అందించిన సేవలను కొనియాడుతూ, ప్రజల ఆశీస్సులతో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, మాజీ ఆత్మ చైర్మన్ విజయ్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ తంజీం, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, కోహీర్ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింలు, పలువురు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కమిషనర్ నియామకానికి మొక్కలు నాటి వినతి



**జహీరాబాద్, జులై 24(జనంసాక్షి):** వైద్య విధాన పరిషత్‌కు వెంటనే రెగ్యులర్ కమిషనర్‌ను నియమించాలని కోరుతూ జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది శుక్రవారం వినూత్నంగా నిరసన తెలిపారు. వైద్య విధాన పరిషత్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన "మొక్కలు నాటుదాం.. మనవి చేద్దాం" కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రెండు నెలలుగా కమిషనర్ పదవి ఖాళీగా ఉండటంతో వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, మినిస్టీరియల్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వ్యక్తిగత, సర్వీస్ సంబంధిత సమస్యల పరిష్కారం నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 185 ఆసుపత్రులు, 4 వేల మంది సిబ్బందితో కీలక వైద్య సేవలు అందిస్తున్న వైద్య విధాన పరిషత్‌కు రెగ్యులర్ కమిషనర్ లేకపోవడం వల్ల పరిపాలనపై ప్రభావం పడుతోందన్నారు. అత్యవసర వైద్య సేవలు అందించే శాఖలో పనిచేస్తున్నందున ప్రజలకు ఇబ్బంది కలిగించే ఆందోళనలు చేపట్టకుండా, పర్యావరణ పరిరక్షణతో పాటు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రెగ్యులర్ కమిషనర్‌ను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డా. కె. కిరణ్ కుమార్, చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ వై. మహేష్, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ వెంకటేశం, ఫార్మసీ ఆఫీసర్లు ఎన్. కుమారస్వామి, ఎం. విక్రమ్, ఎం. శ్రీనివాస్, టి. రాజేశ్వరి, నర్సింగ్ సూపరింటెండెంట్ సునంద, హెడ్ నర్స్ వినోద కుమారి, ఎం. లలిత, డి. నిర్మలమ్మతో పాటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షపు నీటి సంరక్షణ భావితరాలకు భద్రత



**తూప్రాన్, జూలై 24(జనంసాక్షి):** వర్షపు నీటి సంరక్షణ భావితరాలకు భద్రత అని తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ తెలిపారు. మున్సిపాలిటీలో తూప్రాన్ మండల పరిధిలోని వివిధ శాఖలలో పని చేసే అధికారులతో "జల్ సంచయ్ జన భాగీదారి–3.0"పై అవగాహన కార్యక్రమం లో పాల్గొని ప్రసంగించారు. రమేష్ కుమార్ తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో "జల్ సంచయ్ జన భాగీదారి–3.0" కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో వర్షపు నీటి సంరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, "ప్రతి నీటి బొట్టు అమూల్యమైనది – నేడు వర్షపు నీటిని సంరక్షిస్తే, రేపటి తరాలకు తాగునీటి భద్రతను అందించగలం" అని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో, ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్యాసంస్థల్లో, వాణిజ్య సంస్థల్లో రూఫ్‌టాప్ రేన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. భవిష్యత్ తరాలకు జలభద్రతను అందిద్దాం అని అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## మెదక్‌లో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**మెదక్ బ్యూరో, జులై 24 (జనంసాక్షి):** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలో మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ లు, ఆరేళ్ల మల్లికార్జున గౌడ్, బట్టి జగపతి, జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు ఏం లావణ్య రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు, మున్సిపల్ కౌన్సిలర్లు బట్టి ఉదయ్ కుమార్, దీపక్ కుమార్, జుబేర్ అహ్మద్, సోహెల్, నాయకులు గడ్డమీది కృష్ణ గౌడ్, లింగారెడ్డి, ప్రభు రెడ్డి,సురేందర్ గౌడ్, మాయ మల్లేశం, ఆర్ కె శ్రీనివాస్, సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, సోములు, జగన్, కిష్టయ్య, లక్ష్మీనారాయణ, లక్ష్మణ్,సాయి, సాప. సాయిలు, రామచంద్ర రెడ్డి, సాయ గౌడ్, యామి రెడ్డి,రమేష్,మార్గం. ఆంజనేయులు, శ్రీనివాస్ గౌడ్, మోహన్ నాయక్, నరేందర్ రెడ్డి, ప్రభాకర్, మధు, వేణు, శ్రీనివాస్ గౌడ్ శ్రీనివాస్, ఎంబిపూర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాఫియా మాయ.. గుట్టలు మాయం!

- ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు
- "కోహిర్ మండల్ ఎమ్మార్వో సుప్రియ మెరుపు దాడి"
- "రెండు టిప్పర్లు, ఒక జేసీబీ సీజ్!"



**కోహీర్, జులై 24 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల పరిధిలోని చింతల్‌ఘట్టు గ్రామం సమీపంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న అక్రమ మట్టి తవ్వకాలపై రెవెన్యూ యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా, నిబంధనలను తృణప్రాయంగా తీసిపారేస్తూ యథేచ్ఛగా మట్టి తోడుతున్నారనే పక్కా సమాచారంతో కోహిర్ మండల తహసీల్దార్ (ఎంఆర్ఓ) సుప్రియ మెరుపు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు భారీ టిప్పర్లతో పాటు మట్టిని తోడుతున్న ఒక (జేసీబీ) వాహనాన్ని అధికారులు అక్కడికక్కడే స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రకృతి సంపదను దోచుకుంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కఠినంగా హెచ్చరించారు. మండలంలో అక్రమ మైనింగ్ లేదా తవ్వకాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆస్తులను, ప్రకృతి సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తుచేశారు. ఎక్కడైనా అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఉపేక్ష లేదని, చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. మండలంలో ఎక్కడ అక్రమాలు జరిగినా తమ దృష్టికి తీసుకురావలని అన్నారు.

### ఎల్‌నినోను అధిగమించేందుకు

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- జిల్లాలో చేపడుతున్న పనులను వివరించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ బ్యూరో, జూలై 24 (జనంసాక్షి):** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేసి, రైతులకు పూర్తి మద్దతు అందించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. శుక్రవారం డా బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి ఎన్ నినో నేపథ్యంలో పంటల పంటల వైవిధ్యీకరణ, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీపై వివిధ శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లుతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ..రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, మార్కెట్ ధోరణులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో పంటల వైవిధ్యీకరణను అమలు చేయాలని సూచించారు. సుమారు 30 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యామ్నయ పంటల ప్రణాళికలను జిల్లా, మండల, గ్రామ స్థాయిల వారీగా సిద్ధం చేయాలని ఆదేశించారు. గత కొన్ని రోజుల నుండి వాతావరణ శాఖ ఇస్తున్న అంచనాలు నిజమవుతున్నాయని, ప్రస్తుత పరిస్థితులు మెరుగుపడే అవకాశాలు తక్కువగా ఉన్నందున అధికారులు ఆలస్యం చేయకుండా తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రైతుల వద్దకు వెళ్లి వారి మనోభావాలను అర్థం చేసుకుని, అవగాహన కల్పించాలని సూచించారు. ఎంఎస్పి పై స్పష్టమైన అవగాహన కల్పించాలని, పంటల కనీస మద్దతు ధరపై ఎలాంటి సందేహాలు లేకుండా రైతులకు ధైర్యం కల్పించాలని తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు 20 పంటలకు ఎంఎస్పి అమలులో ఉందని, కేవలం వరి పంటకే ఎమ్ఎస్పీ ఉందని భావించడం సరికాదని స్పష్టం చేశారు. పత్తి సహా అనేక పంటలకు ఎంఎస్పీ రక్షణ ఉందని వివరించారు. మార్కెట్ ధర ఎంఎస్పి కంటే తగ్గితే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులకు స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు. రైతుల్లో అపోహలు తొలగించి, ప్రభుత్వంపై విశ్వాసం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రత్యామ్నాయ పంటలతో ఆదాయం తగ్గదని,

ప్రత్యామ్నాయ పంటల సాగుకు వల్ల రైతుల ఆదాయం తగ్గుతుందని భావించాల్సిన అవసరం లేదని, కొన్నిసార్లు ఎక్కువ ఆదాయం కూడా వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రైతుల సాగు అలవాట్లను మార్చి, అనుకూల పంటలపై మార్గదర్శకత్వం ఇవ్వాలని అధికారులకు సూచించారు. కూరగాయల సాగును ప్రోత్సహించాలని, వాటికి మార్కెట్లో మంచి ధరలు లభించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ధరలు పడిపోకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రతి జిల్లాలో అత్యవసర ప్రణాళికలను సిద్ధం చేసి వెంటనే అమలు చేయాలని, అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొంతమంది కలెక్టర్లు సూచించినట్లుగా రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎల్ నినో ప్రభావం వల్ల పంటల సాగుకు ఎదురయ్యే నీటి సమస్యలను వివరిస్తూ పంటల మార్పిడి చేపట్టేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఎల్ నినో పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల ద్వారా కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించాలని కనీస మద్దతు ధర లభించే పంటలు, కూరగాయల సాగు పై రైతు వేదికల ద్వారా, రైతు వాట్సప్ గ్రూపుల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. గత సంవత్సరం ఎంత పంట సాగు జరిగింది, ప్రస్తుతం ఎంత జరిగింది సమగ్ర నివేదికలు అందచేయాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్ జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, డిఆర్డీఏ శ్రీనివాసరావు జిల్లా విద్యదికారి రాజు,ఎస్సి, ఎస్టీ,బిసి, మైనారిటీ, కెజిబివి, మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పుల్కల్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ విస్తృత పర్యటన

- కేజీబీవీ, పీహెచ్‌సీ తనిఖీ.. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనుల పరిశీలన





**పుల్కల్, జూలై 24 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ విస్తృతంగా పర్యటించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, సురక్షిత వాతావరణం కల్పించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శుక్రవారం పుల్కల్ మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్వాపూర్ శివారులో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ పనులను పరిశీలించారు. ముందుగా బస్వాపూర్ శివారులో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించిన కలెక్టర్, పనుల పురోగతిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం పుల్కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్,నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలించారు. భవనాన్ని త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, సంబంధిత మంత్రి చేత ప్రారంభించేలా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని వైద్యాధికారికి సూచించారు.

తదుపరి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్,పాఠశాల ఆవరణ,డార్మిటరీలు,తరగతి గదులు,స్టోర్‌రూమ్, వంటశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఈగలు,దోమలు పెరగకుండా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిర్వాహకులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పరిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారం అందించాలని సూచించారు. విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా 6వ తరగతి విద్యార్థినులతో కలెక్టర్ ప్రత్యక్షంగా మాట్లాడి వారి అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలించారు. పాఠ్యాంశాలు చదివించి వారి ప్రతిభను తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులకు నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని వారికి సూచించారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, మండల తహసిల్దార్ కృష్ణ,ఎంపీడీవో లక్ష్మి, ఎంపిఓ వెంకటేశ్వర్ రెడ్డి, మండల విద్యాధికారి శంకర్, కేజీబీవీ ప్రిన్సిపాల్ ఇందిరా ఉపాధ్యాయులు,ఇంజనీరింగ్ అధికారులు, వైద్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షపు నీటి ప్రతి చుక్కను ఒడిసిపట్టాలి

- ఇంకుడు గుంతల నిర్మాణాన్ని తప్పనిసరి చేద్దాం
- భూగర్భ జలాల పెంపు, సంరక్షణ కు కృషి చేయాలి
- వీబిజీ రామ్‌జీలో భాగంగా భూగర్భ జలాల పెంపుకు వెంటనే పనులు చేపట్టాలి
- మండలాల వారీగా ఇచ్చిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ బ్యూరో, జులై 24 (జనంసాక్షి):** వర్షపు నీటి ప్రతి చుక్కను ఒడిసి పట్టాలని ఇంకుడు గుంతల నిర్మాణాన్ని తప్పనిసరి భూగర్భ జలాల పెంపు, సంరక్షణ కు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ విడియో కాన్ఫెరెన్స్ హాల్ నందు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వీబి జీ రామ్‌జీలో భాగం గా భూ గర్భ జలాల పెంపు కార్యక్రమంపై ఎంపీడీవోలు, ఎంపీ ఓలు, ఏపీఓలతో మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (వీబీ-జీ రామ్‌జీ) పథకం అమలు, జిల్లాలో పటిష్టంగా అమలు కావాలన్నారు భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఇదే సరైన సమయమని పేర్కొన్నారు ప్రజలందరూ ఇంకుడు గుంతలు నిర్మించేలా యుద్ధ ప్రాతిపదికన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వర్షపు నీటి ప్రతి చుక్కను భూమిలోకి పంపించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ,నీటి భద్రత కోసం ఫామ్ పాండ్‌లను, వ్యక్తిగత ఫామ్ పాండ్‌లు, బోరుబావి రీఛార్జ్ పిట్‌లు, వర్మి-కంపోస్ట్ యూనిట్లు, పర్కోలేషన్ ట్యాంకుల నిర్మాణం లక్ష్యాల దిశగా ముందుకు సాగాలన్నారు, కొంటె సాకులతో కాలాన్ని వృధా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు .ప్రతి మండలంలో ఎంపీడీవో ఎంపీవో ఏపీవో సమన్వయంతో పటిష్ట కార్యచరణ ద్వారా పూర్తి చేయాలన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రకృతి విపత్తును సమిష్టిగా ఎదుర్కోవడానికి ప్రభుత్వ పరంగా మన వంతు సహకారం అందించాలని రైతులకు ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డి ఆర్ డి ఎ పి డి శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, అన్నిమండలాల, ఎంపీడీవోలు, ఎంపీ ఓలు, ఏ పీ ఓ లు తదితరులు పాల్గొన్నారు.

### కొండపాకలోనే

# యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు చేయాలి

- కలెక్టర్ కార్యాలయం ఎదుట అఖిలపక్ష నాయకుల ధర్నా : జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం



**కొండపాక, జూలై 24 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా కొండపాక మండలానికి ప్రభుత్వం మంజూరు చేసిన యంగ్ ఇండియా స్కూల్‌ను మండలంలోనే ఏర్పాటు చేసి, నిర్మాణ పనులను వెంటనే ప్రారంభిం చాలని డిమాండ్ చేస్తూ కొండపాక మండల యంగ్ ఇండియా స్కూల్ సాధన సమితి ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సంద ర్భంగా నాయకులు అనంతరం నరేందర్ రాగల దుర్గయ్య తదితరు లతో కలిసి మాట్లాడుతూ కొండపాక మండల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మంజూరు చేసిన యంగ్ ఇండియా స్కూల్‌ను ఇతర ప్రాంతాలకు తరలించకుండా కొండపాకలోనే ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి, మండల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా యంగ్ ఇండియా స్కూల్‌ను కొండపాకలోనే ఏర్పాటు చేసి, పనులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, యంగ్ ఇండియా స్కూల్ సాధన సమితి సభ్యులు, ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మరియు సామాజిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.